IYYALATELANGANA

# ఇయ్యాల తెలంగాణ

మన భాష – మన యాస

iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana

హైదరాబాద్ ఆదివారం 19-07-2026 సంపుటి :10 సంచిక :362 పేజీలు 8 వెల. రూ॥ 4 /-


# ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన
అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం




హైదరాబాద్,జూలై18( ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు.ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ..తనను కలవాలని సందేశం

న్యూఢిల్లీ,జులై18( భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు



తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజనీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు.

## దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ

'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం

హైదరాబాద్,జూలై18:భారత్ తొలి ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.



# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,జూలై18(: చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది.చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ – నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది


జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
కొలువ్వుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
తెలంగాణలో లూటీ జరుగుతోంది
మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్,జూలై18(): ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు.

# నా కుటుంబానికి పెద్దన్న అందెశ్రీ: సీఎం రేవంత్

హైదరాబాద్, జులై 18: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ స్మృతివనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు



చేశారు.ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు.

IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

## సంపాదకీయం

# బ్రాండ్ భారత్ ....

కాంగ్రెస్ నిర్మించిన వ్యవస్థలు కేవలం ఒక దేశాన్ని నడిపితే.. బీజేపీ సృష్టిస్తున్న సంస్కరణలు ఒక అజేయమైన గ్లోబల్ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్నాయి. వందేళ్ల తర్వాత దేశ చరిత్రను తిరగేస్తే.. కనిపించేది పాత పరిపాలనా పుటలు కాదు, సరికొత్తగా ప్రపంచాన్ని శాసిస్తున్న బ్రాండ్ భారత్ విశ్వరూపం!''బీజేపీ బ్రాండ్ ఆవిష్కృతమవుతోంది. అయితే ఈ బ్రాండ్ మత రాజకీయాలు లేదా హిందూత్వ రాజకీయాలు లేకపోతే ఆ పార్టీ భావజాలంతో సంబంధం ఉన్నది కాదు. ఓ కొత్త భారత దేశాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించబోతున్నారు. అందుకే ఈ పార్లమెంట్ సమావేశాలే సాక్ష్యం కానున్నాయి. నిన్నటివరకు కేవలం సదస్సులకో, మేధోమథనాలకో లేదా కేవలం రాజకీయ పార్టీల మేనిఫెస్టోలకో పరిమితమైన ఊహాజనిత సంస్కరణలు.. ఇప్పుడు ఆ ఊహల పరిధిని దాటి పార్లమెంట్ గడప తొక్కి చట్టరూపం దాల్చబోతున్నాయి. దేశ భవిష్యత్తును, భౌగోళిక-రాజకీయ స్వరూపాన్ని సమూలంగా మార్చేయగల సంచలన రాజ్యాంగ సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోంది. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన వ్యవస్థాగత మార్పులకు తావులేకుండా, కాలంచెల్లిన సంప్రదాయాలను బద్దలు కొడుతూ నవభారత నిర్మాణానికి ఈ నిర్ణయాలు పునాది వేస్తున్నాయి.మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు, నియోజకవర్గాల శాస్త్రీయ పునర్విభజన, వన్ నేషన్ ? వన్ ఎలక్షన్, ప్రధాని, సీఎంలపై అనర్హత వంటి విప్లవాత్మక అడుగులు కేవలం చట్టపరమైన సవరణలు మాత్రమే కావు; అవి దేశ పరిపాలనా ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త బ్రాండ్. నిరంతర ఎన్నికల జాతర నుంచి దేశాన్ని విముక్తం చేసి, రాజకీయ స్థిరత్వాన్ని , పారదర్శకతను జాతీయ అజెండాగా మార్చడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రస్థానం, భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత శక్తివంతంగా నిలబెట్టబోతోంది. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన పరిపాలనా రంగానికి చరమగీతం పాడుతూ, కాలంచెల్లిన సంప్రదాయాల స్థానంలో నవభారత నిర్మాణానికి ఈ చరిత్రాత్మక నిర్ణయాలు అజేయమైన పునాది వేయనున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సమతుల్యత కోసం ఉద్దేశించిన 'ది డీలిమిటేషన్ బిల్లు 2026 , దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా రూపొందించిన వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ వంటి అడుగులు కేవలం చట్టపరమైన మార్పులు మాత్రమే కావు. ఇవి నిరంతర ఎన్నికల జాతర, రాజకీయ అస్థిరతల నుంచి దేశాన్ని విముక్తం చేసే సరికొత్త వ్యూహాత్మక అస్త్రాలు. వీటికి తోడు, క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ లేదా శిక్ష పడితే ప్రధానమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా తక్షణమే పదవులు కోల్పోయేలా చట్టాల్లో తేవాలనుకుంటున్న పారదర్శక మార్పులు.. రాజకీయాల్లో జవాబుదారీతనానికి సరికొత్త అర్థాన్ని ఇస్తున్నాయి. ఈ విప్లవాత్మక సంస్కరణల సమాహారమే యావత్ భారతదేశాన్ని ఒక పటిష్టమైన, నైతికమైన ప్రగతి పథంలోకి నడిపించబోతోంది.అన్నీ అనుకుంటాం కానీ సాధ్యమేనా? అని దశాబ్దాలుగా సగటు భారతీయుడు సందేహించిన ప్రతి అసాధ్యమైన నిర్ణయాన్ని సుసాధ్యం చేసి చూపిస్తోంది ప్రస్తుత భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి. వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయిన అవినీతిని, నిర్ణయాత్మక లోపాలను నిర్మూలిస్తూ సాగుతున్న ఈ ప్రస్థానం భారత ప్రజాస్వామ్యానికే ఒక రక్షణ కవచం. అయితే, ఇక్కడ రాజకీయ వాస్తవికతను నిశితంగా పరిశీలిస్తే.. ఎన్డీఏ అనేది కేవలం సాంకేతిక భాగస్వామ్య కూటమి మాత్రమేనని స్పష్టమవుతుంది. ఈ సాహసోపేతమైన, అచంచలమైన నిర్ణయాల వెనుక ఉన్న అసలైన చోదక శక్తి, వందకు వంద శాతం రాజకీయ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీ ? అమిత్ షా ద్వయానికే దక్కుతుంది. ఈ ఇద్దరు నాయకుల అద్భుతమైన రాజకీయ సంకల్పం, జాతీయ ప్రయోజనాలే పరమావధిగా సాగించే మైండ్ గేమ్.. ప్రాంతీయ పార్టీల బ్లాక్‌మెయిలింగ్ పాలిటిక్స్‌కు, ఒత్తిళ్లకు శాశ్వతంగా తాళం వేశాయి. ఎలాంటి తొట్రుపాటు, తడబాటు లేని స్థిరత్వంతో కూడిన ఈ నయా రాజకీయం, దశాబ్దాలుగా పేరుకుపోయిన పాత ముద్రలను చెరిపేస్తూ 'బీజేపీ బ్రాండ్ భారత్'ను ఆవిష్కరిస్తోంది. ప్రాంతీయ సెంటిమెంట్ల నడుమ కూడా జాతీయ సమగ్రతను కాపాడుతూ సాగుతున్న ఈ మహా సంస్కరణల పర్వం,. ప్రాంతీయ శక్తులు ఒకవైపు ఒత్తిడి పెంచుతున్నా, వాటిని సమర్థవంతంగా సమతూకం చేస్తూ, రాజీలేని వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. వందకు వంద శాతం రాజకీయ స్థిరత్వంతో, పటిష్టమైన సుదీర్ఘ వ్యూహంతో తాము అనుకున్న విధంగా దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మిత్రపక్షాలను ఎక్కడా నొప్పించకుండానే, వారితో సున్నితమైన రాజకీయ సమన్వయాన్ని పాటిస్తూనే.. తమ జాతీయ ఎజెండాను బలంగా అమలు చేయడం వీరి ప్రత్యేకత. సంకీర్ణ బంధాల పరిమితులను అధిగమించి, ఆధునిక భారతదేశ పరిపాలనపై సరికొత్త బీజేపీ బ్రాండ్ ముద్రను మోదీ-షా ద్వయం అత్యంత శక్తివంతంగా వేస్తోందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.భారతదేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టడం అనేది నివురుగప్పిన నిప్పులాంటి తేనెతుట్టెను కదిలించడమే. దేశంలో జనాభా ప్రాతిపదికన స్థానాలను పెంచాల్సి వచ్చిన ప్రతిసారీ ప్రాంతీయ శక్తులు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చాయి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి దేశాభివృద్ధికి తోడ్పడిన తమకు సీట్లు తగ్గిపోతాయని, జనాభాను నియంత్రించని ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాధాన్యత పెరిగిపోతుందనే భయాందోళనలు దశాబ్దాలుగా నడుస్తున్నాయి. చాలా ప్రాంతీయ పార్టీలు ఈ అంశాన్ని ఒక సెంటిమెంట్‌గా మార్చి, జాతీయ సమగ్రతకు భంగం కలిగేలా ప్రాంతీయ విభేదాలను రగల్చడం ద్వారా స్వార్థ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూశాయి.

# కమలానికి ట్రబుల షూటర్ కావలెను...



హైదరాబాద్, జూలై 18(న్యూస్ పల్స్) తెలంగాణ రాజకీయ చిత్రపటంపై కమలం పార్టీ వేగంగా విస్తరిస్తోంది. గత కొన్ని ఎన్నికల సరళిని గమనిస్తే బీజేపీ ఓటు బ్యాంకు, సీట్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఒకప్పుడు నామమాత్రపు ఉనికికే పరిమితమైన పార్టీ, నేడు 8 పార్లమెంటు స్థానాలను గెలుచుకునే స్థాయికి చేరిందంటే రాష్ట్రంలో ఆ పార్టీ ప్రాభవం ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలను చూసిన తెలంగాణ ఓటర్లు? కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని, పార్టీ అందిస్తున్న హిందుత్వ నినాదాన్ని నమ్మి ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, ఇంత సానుకూల వాతావరణం ఉన్నా, రేపటి ఎన్నికల్లో అధికారం హస్తగతం చేసుకోవాలనే బీజేపీ కల నిజమవ్వడానికి ఒక పెద్ద అడ్డంకి పదే పదే తెరపైకి వస్తోంది. అదే? సమర్థవంతమైన, రాష్ట్ర స్థాయి 'మాస్ లీడర్' లేకపోవడం.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో ఓటు బ్యాంకు పెరుగుతున్న మాట వాస్తవమే అయినా, దానిని క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చి పోలింగ్ బూత్ వరకు నడిపించే బలమైన వ్యూహకర్త, ప్రజాకర్షక నాయకుడు కరవయ్యారు. ప్రత్యర్థి పార్టీలను గమనిస్తే? కాంగ్రెస్‌కు రేవంత్ రెడ్డి లాంటి దూకుడున్న మాస్ లీడర్ ఉన్నారు. బీఆర్ఎస్ వైపు చూస్తే కేసీఆర్ చరిష్మాతో పాటు కేటీఆర్, హరీశ్ రావు లాంటి వాగ్ధాటి, జనాలను ఆకట్టుకునే నేతలున్నారు. కానీ బీజేపీలో మైకు పడితే జనాలను తనవైపు తిప్పుకుని, అధికార పీఠం వైపు నడిపించగల అగ్రనేత ఎవరనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.ప్రస్తుతానికి రాష్ట్రంలో ఉన్న కిషన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సౌమ్యులుగా ముద్రపడ్డారు. క్లిష్టమైన రాజకీయ పోరాటాల్లో ఇలాంటి సౌమ్యత పార్టీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేకపోతోంది. మరోవైపు బండి సంజయ్ మాటలు, లక్ష్మణ్ లాంటి నేతల ఉపన్యాసాలు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లను పూర్తి స్థాయిలో సమ్మోహన పరచలేకపోతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే స్థానిక నేతలు బలంగా ఉన్నారు. దాదాపు 30 స్థానాల్లో మినహా, మిగిలిన చోట్ల కేవలం నరేంద్ర మోదీ ముఖాన్ని చూసి లేదా పార్టీ సిద్ధాంతాన్ని చూసి ఓట్లేయాల్సిన పరిస్థితి ఉంది.పట్టణ ప్రాంతాల్లో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకత్వ బలం, ప్రజల్లో నిరంతరం ఉండే మాస్ లీడర్ చరిష్మా మాత్రమే ఓట్లను రాల్చగలవు. ఈ బలహీనతను పసిగట్టే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాంటి ప్రత్యర్థి నేతలు ఢిల్లీ వేదికగా సైతం "తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు" అని ధీమాగా సవాల్ విసరగలుగుతున్నారు. ఓటు బ్యాంకు ఉన్నా, దానికి సరైన దిశా నిర్దేశం చేసే నాయకత్వం లేకపోతే ఎన్నికల రేసులో వెనుకబడక తప్పదనే విషయం కమలనాథులకు అర్థమవుతోంది.ఈ నేపథ్యంలోనే బీజేపీ జాతీయ అధిష్టానం ఇప్పుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలు, మోదీ ఇమేజ్‌పైనే ఆధారపడకుండా? తెలంగాణ మట్టి వాసన తెలిసిన, దూకుడుగా ఉంటూ ప్రజలను ఉర్రూతలూగించగల ఒక సమర్థవంతమైన 'మాస్ లీడర్' కోసం అధిష్టానం వేట మొదలుపెట్టింది. లీడర్షిప్ లోపాన్ని సవరించుకుంటేనేవచ్చే ఎన్నికల్లో అధికారం సాధించడం సాధ్యమవుతుందని అటు పార్టీ శ్రేణులు, ఇటు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నాయకత్వ లోటును బీజేపీ ఎంత త్వరగా భర్తీ చేస్తుందనే దానిపైనే ఆ పార్టీ తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉంది.





గౌలిపుర , జూలై 18 (ఇయ్యాల తెలంగాణ) : ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని ప్రారంభమైన గోల్కొండ బోనాల ఉత్సవాలలో పాతబస్తీ సీనియర్ నాయకులు, సంఘ సేవకులు అశోక్ కుమార్ గౌడ్ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ ప్రాంత ప్రజలకు అత్యంత భక్తి, పారవశ్యాన్ని అందిస్తాయని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ముఖ్యంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం సిపి సజ్జనార్ ఆధ్వర్యంలో పోలీసింగ్ వ్యవస్థ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మునిసిపల్, విద్యుత్ శాఖ అధికారులు కూడా విశిష్ట సేవలను అందిస్తున్నారని అశోక్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అమరవీరుల స్థూపం వద్ద కెటిఆర్ కు సవాల్ విసిరిన కాంగ్రెస్ కార్యకర్తలు



హైదరాబాద్, జూలై 18 (ఇయ్యాల తెలంగాణ) : పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కెటిఆర్ నిరుద్యోగుల గురుంచి ఏనాడూ మాట్లాడలేదని ఇప్పుడు యువభేరి ఎవరిని ఉద్దరించడానికి పెట్టడమో అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ ముధిరాజ్ పిలుపు మేరకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు అమర వీరుల స్థూపం వద్ద నుంచి కెటిఆర్ కు సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నపుడు యువత కోసం ఎమైనా అవకాశాలు కల్పించావా, సొంత చెల్లికే నువ్వు అన్నవు కాలేక పోయావని ధ్వజమెత్తారు. ఓర్వలేకనే యువభేరి పేరిట యువతను మభ్య పెట్టె ప్రయత్నమే తప్ప తెలంగాణ యువత గురుంచి కెటిఆర్ కు ఏ మాత్రం ఆలోచన అనేది లేదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మోత రోహిత్ ముధిరాజ్ తో పాటు గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిసిసి ఉపాధ్యక్షుడు చంద్ర మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షా ఆరిఫ్ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ ప్రెసిడెంట్ ముంద్రయి శ్రీనివాస్ మీడియా కోఆర్డినేటర్ కె శ్రీకాంత్ యాదవ్, జాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజ్ కుమార్, మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు తుల్జారామ్, దత్తాత్రేయ నగర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సెయిలింగ్ చాంపియన్‌షిప్ పథకాలు సాధించే క్రీడాకారుల వేదికగా హైదరాబాద్ హుస్సేన్ సాగర్

**ప్రతిష్టాత్మకమైన40వ హైదరాబాద్ సెయిలింగ్ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ సెయిలింగ్‌చాంపియన్‌షిప్ ఘనంగా ముగింపు**








ఇయ్యాల తెలంగాణ : ఒలింపిక్ క్రీడల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడవే కాకుండా అంతర్జాతీయ సెయిలింగ్? చాంపియన్?షిప్? పథకాలు సాధించే క్రీడాకారుల వేదికగా హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నిలిచిందనిఈఎంఈ కమాండెంట్. లెఫ్టినెంట్ జనరల్? నీరజ్ వర్షిన్ అన్నారు. శనివారం హుస్సేన్‌సాగర్‌లో ప్రతిష్టాత్మకమైన40వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ ఈఎంఈ సెయిలింగ్? అసోసియేషన్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్? ఇండియా, సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవిదేశాల సెలర్స్? తో పాటు హుస్సేన్ సాగర్ వేదికగా భారతదేశపు మొట్టమొదటి ఇంటర్నేషనల్ ఐఎల్‌సిఏ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించాలనే కల నిజమవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒలింపియన్లను, అర్జున అవార్డు గ్రహీతలను నాలుగు శతాబ్దాల్లో వందలాది మంది క్రీడాకారులను అందజేసిన ఘనత ఈఎంఈఎస్ఏ సెయిలింగ్ క్లబ్ కీర్తి దక్కిందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో అంతర్జాతీయ క్రీడాకారులతో పాటు దేశంలోని ప్రముఖ ఆర్మీ, నేవీ. సివిలిన్ సెయిలింగ్ సంస్థలకు చెందిన 19 సెయిలింగ్ క్లబ్‌ల నుండి 124 మంది నావికులు (సెలర్స్) పాల్గొన్నారు. వీరిలో 19 మంది మహిళలు బాలికలు పాల్గొన్నారు.

## జోగులాంబకు వెండి బోనం : మురాద్ మహల్ దేవాలయ కమిటీ

గౌలిపుర , జూలై 18 (ఇయ్యాల తెలంగాణ) : ఆషాడమాస బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు ఐదవ శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబకు వెండి బోనం సమర్పించడానికి గౌలిపుర, మురాద్ మహల్ నల్లపోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, జోగిని ఠాగూర్ ఐషు బృందంతో బయలుదేరారు. చైర్మన్ చిట్టెం శ్యామ్ రావు మాట్లాడుతూ మా దేవాలయ కమిటీ సభ్యులు, మా బస్తీ వాసులమంతా కలిసి ఈ యొక్క కార్యక్రమం విజయవంతంగా నిర్వేస్తున్నామని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆ అమ్మవారి కృప ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎద్మ సత్తెప్ప సీనియర్ అడ్వైజర్, కంకర్ల సత్యనారాయణ, ఆవుల మణికంత, దొంకిని ప్రమోద్, కంకర్ల సత్యనారాయణ, మాణిక్ రావు తదితరులు పాల్గొన్నారు



# తండ్రికి అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చిన కూతురు

హైదరాబాద్, జూలై 18 తెలంగాణకు చెందిన ఓ యువతి తన తండ్రి 50వ పుట్టినరోజున ఆయనకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది. తన కలల బండిని కళ్ల ముందు చూసిన ఆ తండ్రి ఆనందంతో ఉప్పొంగిపోయారు. భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ హృద్యమైన దృశ్యాలను ఆ కూతురు వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్‌గా మారి లక్షలాది మంది హృదయాలను కదిలిస్తోంది.వివరాల్లోకి వెళితే.. నందిని కావేరి అనే యువతి తన తండ్రి పుట్టినరోజు కోసం కొన్ని వారాలుగా ఒక సర్‌ప్రైజ్ ప్లాన్ చేసింది. ఇన్నాళ్లూ తన కుటుంబం కోసమే బతికిన నాన్నకు గుర్తుండిపోయే బహుమతి ఇవ్వాలని ఆమె నిర్ణయించుకుంది. పుట్టినరోజునాడు, మొదట వీడియో కాల్‌లో నవ్వుతూ 'హ్యాపీ బర్త్‌డే డాడీ' అని శుభాకాంక్షలు చెప్పింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఆమె తండ్రిని ఇంటి బయటకు తీసుకువచ్చారు. అక్కడ ఒక పెద్ద వస్త్రంతో కప్పి ఉంచిన వస్తువును చూపించారు.ఏముందా అని ఆసక్తిగా ఆ గుడ్డను తొలగించిన తండ్రికి అక్కడ కొత్త మోటార్‌సైకిల్ కనిపించింది. దాన్ని చూసి ఆనందంతో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. తీవ్రమైన భావోద్వేగంతో అక్కడున్న భార్య, పిల్లలను ఒక్కొక్కరిగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన్ను చూసి కుటుంబ సభ్యులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ మధుర క్షణాలు అందరినీ కదిలించాయి.ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ నందిని ఒక ఎమోషనల్ పోస్ట్ రాసింది. "మా నాన్న తన జీవితాంతం మా కుటుంబానికే ప్రాధాన్యతనిచ్చారు. మాకు అన్నీ ఇచ్చారు కానీ తన కోసం ఏనాడూ ఏమీ అడగలేదు. అందుకే నేను ప్రతీ రోజూ కష్టపడి పని చేస్తున్నాను.

## బహదూర్ గూడలో ఉద్రిక్తత

రంగారెడ్డి,శంషాబాద్ మండలం బహదూర్గూడలో 650 ఎకరాల స్థలం సేకరణకు వ్యతిరేకంగా శాంతియుతంగా పట్టాల కోసం రైతులు, గ్రామస్తులు నిరసనకు దిగారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుండి బహదూర్గూడ గ్రామంలో పోలీసులు భారీగా మోహరించారు.కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ భూములను సర్కారు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయిందని గ్రామస్తులు ఆరోపించారు.

ఇయ్యాల తెలంగాణ



# ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి**

**ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

నిజామాబాద్ జూలై 18నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫీచ్రీ, మిషన్ భగీరథ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.వర్షాకాలంలోనూ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు ఎక్కడా లేకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.మరమ్మత్తులు అవసరమైన చోట వెంటనే పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు.నీటి వృథాను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే భూగర్భ జలమట్టం పెరిగేలా నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, ప్రతి గ్రామానికి నిర్ణీత సమయానికి నీటిని అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి నాణ్యతపై నిరంతరం క్వాలిటీ చెకింగ్ నిర్వహించాలని, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకులను గుర్తించి తగిన మరమ్మత్తులు చేయాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వాటర్ ట్యాంకులను వెంటనే డిస్మెంటల్ చేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా చూడాలని అన్నారు.ప్రజల నుంచి తాగునీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులకు ఎలాంటి పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే తాగునీటి సరఫరాలో అలసత్వం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఫీచ్రీ (మిషన్ భగీరథ) ఈఈలు కే. రాకేష్, నరేష్ బాబు, డీఈఈలు నవీన్ రెడ్డి, కౌశిక్, వెంకటేశ్వర్ గౌడ్, ఏడు మండలాల ఏఈఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది:

**ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**ఇందల్వాయి అభివృద్ధికి రూ.23 లక్షల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ**

**సామాజిక సంఘాలు, దేవాలయాల అభివృద్ధికి నిధుల మంజూరు**

నిజామాబాద్ జూలై 18 గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (రాఆఈ) నిధుల కింద రూ.23 లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ నేతృత్వంలో గ్రామ సర్పంచ్, లోకాని గంగామణి- గంగాధర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందల్వాయి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరిన్ని అర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎస్‌డీఎఫ్ నిధుల కింద ముదిరాజ్ సంఘం అభివృద్ధికి రూ.5 లక్షలు, కుమ్మరి సంఘానికి రూ.5 లక్షలు, ఇందల్వాయి శ్రీ రామాలయం ప్రాంగణంలో కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.10 లక్షలు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, సామాజిక భవనాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సభ్యులు, ముదిరాజ్, కుమ్మరి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును మెరుగుపర్చుకోవాలి

**శిక్షల శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి:**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

గోదావరిఖని ,:రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి,శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యలు, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.విధుల నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి అధికారి తన పనితీరును మరింత మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. సమన్లు,బెయిలు మంజూరు కాని అరెస్టు వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు,కోర్టుకు సంబంధించిన అన్ని ప్రక్రియలను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరుపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాక్షులకు కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, వారు ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.విచారణ సమయంలో అనవసర గందరగోళానికి గురికాకుండా వారికి ధైర్యం చెప్పి,న్యాయ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి కేసులో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సీపీ పేర్కొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ నేర సామ్రాజ్యం బట్టబయలు

**యువకులను మభ్యపెట్టి నేరాల వైపు మళ్లించి, శిక్షణ ఇచ్చిన కరుడుగట్టిన నేరస్థుడు**

**8 మంది అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాలో 6 మంది అరెస్ట్**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 చోరీలు**

**రూ.53 లక్షల విలువ చేసే 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కేజీల వెండి, రూ.1,50,000/- నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్స్, 5 బైక్‌లు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

నీలగిరి, జూలై 18 : రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ అంతర్‌రాష్ట్ర నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు రూపొందించిన నేర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుండి 260 గ్రాముల




బంగారు ఆభరణాలు, 5 కేజీల వెండి, రూ.1,50,000/- నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్స్, 5 బైక్‌లు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితులను తమ్మిశెట్టి నాగరాజు(32), అల్లంశెట్టి సాయి కిరణ్ ఏ పాండు(22), సమంతపు వెంకట అశోక్(33), ఆలేటి కోటేశ్వర్ రావు(22), సపావత్ నాగ కిరణ్ బాబు నాయక్(31), పిల్లి రాజేష్(25) గా గుర్తించారు. మరో ఇద్దరు నిందితులు గాడిబోయిన గోపి సాయి(22), తమ్మంద్ర రమేష్(34) పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.ఇటీవల అరెస్టైన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూష్మి శ్రీకాంత్‌ను విచారించగా అతని నేర కార్యకలాపాలకు సంబంధించిన అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. శ్రీకాంత్ ఇచ్చిన సమాచారం ఆధారంగా తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్ లో 12 మొత్తం 40 చోరీ కేసులకు పాల్పడిన అతని ముఠాను పట్టుకునేందుకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, డి.చంద్రశేకర్ రెడ్డి, మిర్యాలగూడ రూరల్ సిఐ పీఎన్‌డీ ప్రసాద్, మిర్యాలగూడ టూ టౌన్ ఎస్ ఆంజనేయులు, మాడ్గులపల్లి ఎస్ఐ సురేశ్ యాదవ్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను పిడుగురాళ్ల, అంజనీపురం, మండేపూడి(ల) అమరావతిలో ఈ ఉదయం సుమారు 9.00 గంటలకు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. నేరస్థుడు ఎంత తెలివిగా ముఠాను నిర్మించినా, ఎంత జాగ్రత్తగా నేరాలకు పాల్పడినా చట్టం నుంచి తప్పించుకోలేడన్నారు. ప్రతి చిన్నఆధారాన్నికీలక సమాచారంగామలిచి నిరంతర దర్యాప్తు ఫలితంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమర్థమైన దర్యాప్తు, ప్రజల సహకారంతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతామని తెలిపారు. యువత తప్పుడు ప్రలోభాలకు లోనై నేరాల వైపు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్ : ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు.శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు.ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు




గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈకిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆస్పత్రికి తరలించిన పోలీసులు..

న్యూఢిల్లీ, జులై 18: జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు ఆస్పత్రికి తరలించారు. వాంగ్‌చుక్‌కు సరైన వైద్యసాయం అందించాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు బలవంతంగా ఆయనను నిరాహార దీక్ష చేస్తున్న శిబిరం వద్ద నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో నిరసనకారులు పోలీసులను అడ్డుకోవటంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.గత 20 రోజులుగా కేవలం ఉప్పు నీరు మాత్రమే తీసుకుంటూ దీక్ష చేయడం వల్ల వాంగ్‌చుక్ దాదాపు 20 శాతం బరువు కోల్పోయారు. సుమారు 9



కేజీలకు పైగా బరువు తగ్గారు. ప్రస్తుతం ఆయన బరువు 56.55 కిలోలు మాత్రమే. వైద్యులు చెబుతున్న దాని ప్రకారం.. ఆయన శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగాయి. కండరాల క్షీణతతో ఆరోగ్యం బాగా దెబ్బతింది. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపిస్తున్నాయి. దీక్ష ఇలాగే కొనసాగి ఉంటే ఆయన ప్రాణాలకు ముప్పు వాటిల్లేది.

# సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి.. సిరా లాంటి ద్రవంతో మహిళ దాడి..

ఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై సిరా లాంటి ద్రవంతో ఓ మహిళ దాడి చేసింది. జంతర్ మంతర్ వద్ద దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై దాడికి పాల్పడింది. దీంతో దీప్కే మద్దతుదారులు మహిళ వైపు ఒక్కసారిగా దూసుకెళ్లడంతో జంతర్ మంతర్ వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. అయితే, మహిళ ఎవరు? దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష



భగ్నం తర్వాత తాను కూడా నిరశనకు దిగుతానని దీప్కే ప్రకటించిన కాసేపటికే అతనిపై ఈ దాడి జరిగింది. ఘటన అనంతరం ఎక్స్ వేదికగా దీప్కే స్పందించారు. దాడికి సంబంధించిన వీడియోను పోస్టు చేస్తూ 'నీలం నా రంగు... జై భీమ్!' అని ఆయన పేర్కొన్నారు.కాగా, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. 21వ రోజుకు చేరుకున్న నిరశన దీక్షను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ప్రశ్నపత్రాల లీక్ ఘటనలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ ఆధ్వర్యంలో వాంగ్‌చుక్ నిరసనకు దిగిన విషయం తెలిసిందే. జూన్ 28 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టడంతో ఆయన దాదాపు 9.5 కిలోల బరువు తగ్గారు.

# 'ఇరాన్‌ది ఎప్పటిలాగే అసత్య ప్రచారం'.. చమురు ట్యాంకర్ల పేలుడుపై అమెరికా



హర్మూజ్ జలసంధి లో సీమైన్‌ల ను ఢీకొట్టి రెండు చమురు ట్యాంకర్లు పేలినట్లు ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా ఖండించింది. ఎప్పటిలాగే ఐఆర్‌జీసీ అసత్య ప్రచారం చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. కాగా హర్మూజ్‌లో రాకపోకలను అమెరికా, ఇరాన్ దేశాలు నియంత్రిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన నౌకలపై ఈ రెండు దేశాల సైన్యాలు దాడులు చేస్తున్నాయి.ఈ క్రమంలో అమెరికా నిఘా సమాచారంపై ఆధారపడి వెళ్లిన రెండు నౌకలు సీమైన్స్‌ను ఢీకొట్టి పేలిపోయాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది. తమ దేశంలోని యూఎస్ బేస్‌లు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండటంతో కువైట్ విమాన కార్యకలాపాలను నిలిపివేసింది. అమెరికా సైనిక బలగాలకు ఆశ్రయం ఇస్తున్న దేశాలపై తమ దాడులు కొనసాగుతూనే ఉంటాయని మరోవైపు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఆ దేశాలు తమ పౌరుల్ని రక్షించుకునే ప్రయత్నాలు చేసుకోవాలని సూచించింది.

## 81 అడుగుల రాముడి విగ్రహ నిర్మాణం.. హిందూ వ్యక్తి అరెస్టుతో ఢాకాలో మైనార్టీల నిరసన




ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఇవాళ హిందూ మైనార్టీలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. హరిదాస్ చంద్ర తరణి దాస్‌ను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఢాకాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ వద్ద ఇవాళ ఈ ఆందోళన జరిగింది. గైబందా జిల్లాలో 81 అడుగుల రాముడి విగ్రహాన్ని నిర్మించేందుకు హరిదాస్ చంద్ర పూనుకున్నారు. అయితే ఆయనపై బంగ్లా సర్కారు మనీ ల్యాండరింగ్ అభియోగాలు నమోదు చేసి అరెస్టు చేసింది. రాముడి విగ్రహ నిర్మాణాన్ని ఆపేందుకే బంగ్లాదేశ్ సర్కారు హరిదాస్‌ను అరెస్టు చేసినట్లు హిందూ-బౌద్ధ-క్రైస్తవ ఐక్యతా సంఘం ఆరోపించింది. మైనార్టీలను టార్గెట్ చేసి వేధిస్తున్నారని, దాస్‌ను తక్షణమే రిలీజ్ చేయాలని మైనార్టీలు డిమాండ్ చేశారు.పలాస్‌బారిలో రామచంద్రుడి విగ్రహాన్ని దాస్ నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ అక్రమ రీతిలో తరణిదాస్‌ను అరెస్టు చేసినట్లు మనీంద్ర కుమార్ నాథ్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో గత రెండేళ్ల నుంచి మూడు వేల దాడి ఘటనలు జరిగాయని, దీంట్లో 66 మంది మర్డర్ అయ్యారని, అనేక ఆలయాలను ధ్వంసం చేశారని తెలిపారు. సుమారు 10 కోట్ల మేరకు అక్రమలావాదేవీలు నిర్వహించినట్లు హరిదాస్‌పై కేసు ఉన్నది. 2010లో ఆయన ఇండియాకు వెళ్లారని, 2019లో ముస్లింగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి : మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి

**ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి**

**అమ్మపాలెంలో సర్ కార్యక్రమ పరిశీలన**

వైరా, జూలై 18 : వైరా నియోజకవర్గంలోని అమ్మపాలెం గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (రాఎఫ్) కార్యక్రమాన్ని శనివారం వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి పరిశీలించారు. గ్రామంలో రాఎఫ్ కార్యక్రమం సక్రమంగా అమలవుతోందా, ఎంతమందికి గణన ఫారాలు పంపిణీ చేశారు, ఫారాలు నింపడంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అంశాలను ఆమె స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, బీఎల్ఓతో మాట్లాడి ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని వృద్ధులను పలకరించి, వారి ఓటరు వివరాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలకు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కిలారు మాధవరావు, మాజీ సర్పంచ్ చిలుకూరి నాగేంద్రమ్మ, బీఎల్ఏ కామసాని నాగేశ్వరరావు, జడ రాజ్‌కుమార్, తేజావత్ రామ్మూర్తి, తేజావత్ రామ, గ్రామ అధ్యక్షుడు షేక్ ఖాదర్ బాబు, రావెల శ్రీనివాసులు, పుప్పాల రామలింగం, దారగని వెంకటేశ్వర్లు, ఎస్కే ఇబ్రహీం, ఎస్కే చాంద్‌మియా, చవగాని సైదులు, చవగాని వెంకట పిచ్చయ్య, పసుపులేటి కృష్ణయ్య, అయినాల ముక్కంటి, చిలుకూరి ప్రసాద్, బానోతు నాగేశ్వరరావు, గుగులోత్ కృష్ణ, బొమ్మగాని వీరయ్య, జడ లక్ష్మయ్య, జడ సంగయ్య, అంబాల అయోధ్య, అంబాల ఉదయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇయ్యాల తెలంగాణ



## తెరపైకి ప్రాజెక్టు మేఘాలయ

చెన్నై, జూలై 18, (న్యూస్ పల్స్) తమిళనాడులో హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందన్న ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రాజెక్ట్ మేఘాలయ పేరుతో కొందరు వ్యక్తులు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు భారీగా నగదు ఆశచూపి వారిని తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్లు చెన్నై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగా దాదాపు 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను సంప్రదించే ప్లాన్ లో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఊతంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్.ఇళయరాజా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఐపీడీఎస్ అనే ఒపీనియన్ పోలింగ్ సంస్థను నడుపుతున్న యూట్యూబర్ తిరునావుక్కరసు తనకు రూ.35 కోట్ల ఆఫర్ చేశాడని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ విప్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఓటు వేయాలని వారు కోరారని, దానికి తాను అంగీకరించకపోవడంతో తనతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా బెదిరించారని ఎమ్మెల్యే ఆరోపించారు.ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని అరెస్ట్ చేశారు. ఇదే క్రమంలో ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ని కూడా జులై 15, 16 తేదీల్లో విచారించి ఆయన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో ఆయన సంప్రదింపులు జరిపినట్లు ఆధారాలు లభించాయని పోలీసులు చెబుతున్నారు. అయితే సరైన విధానాన్ని పాటించకుండా ఓ జర్నలిస్టును అర్ధరాత్రి వరకు విచారించారని చెన్నై ప్రెస్ క్లబ్ ఆరోపిస్తూ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించింది. పోలీసులు మాత్రం చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి, డీఎంకే నేత సెంథిల్ బాలాజీతో పాటు ఆయన సోదరుడు అశోక్‌కు కూడా పోలీసులు సమన్లు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారింది. అయితే తమపై వస్తున్న ఆరోపణలను డీఎంకే పూర్తిగా ఖండించింది. రాజకీయ లబ్ధి కోసమే టీవీకే పార్టీ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తోందని, దీనిపై చట్టపరంగానే స్పందిస్తామని ఆ పార్టీ స్పష్టం చేసింది. ఇక 'ప్రాజెక్ట్ మేఘాలయ' పేరుతో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంలో ఇంకా ఎలాంటి విషయాలు బయటపడతాయో చూడాలి.

## సోనం వాంగ్ ఎవరు..



న్యూఢిల్లీ, జూలై 18, (న్యూస్ పల్స్)నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని.. కేంద్ర ప్రభుత్వం ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని కొద్దిరోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రముఖ భారతీయ ఇంజనీర్.. విద్యాసంస్కర్త.. పర్యావరణవేత్త.. సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన ఏ మాత్రం తన నిర్ణయాన్ని మార్చుకోవడం లేదు. పైగా మరింతతీవ్రంగా దీక్ష చేస్తున్నారు.సోనం వాంగ్ చుక్ ఆరోగ్యం క్షీణించి పోతున్న నేపథ్యంలో.. కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆయన చేస్తున్న దీక్ష శిబిరం నుంచి ఏ క్షణంలోనైనా తీసుకెళ్లి.. ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. వాంగ్ చుక్ దీక్షకు మొదట్లో అంతగా స్పందన లభించలేదు. అయితే ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా మారడంతో సోషల్ మీడియాలో ఉద్యమం మొదలైంది. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు నిరవధిక నిరసన దీక్షలో పెద్దగా పాల్గొన్నట్లు కల్పించడం లేదు. కేవలం చర్చ మొత్తం సోనం చుట్టూ తిరుగుతోంది.సోనం స్వస్థలం లడక్. ఇతడు భారతీయ ఇంజనీర్. విద్యాసంస్కర్త.. పర్యావరణవేత్త.. సామాజిక కార్యకర్త కూడా.. హిమాలయాలలో పర్వత ప్రాంతాలలో ప్రజలు పడుతున్న సమస్యలకు ఈయన సహజసిద్ధమైన పరిష్కార మార్గాన్ని చూపించారు. తద్వారా అంతర్జాతీయంగా గుర్తింపు సాధించారు.. సోనం జీవితం ఆధారంగానే హిందీలో ఓ సినిమాను రూపొందించారు. అందులో అమీర్ ఖాన్ పోషించిన ఫున్ సుక్ పాత్రకు ప్రేరణ సోనం.సోనం లడక్ ప్రాంతంలో స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూమెంట్ ఆఫ్ లడక్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఆయన ప్రయత్నం మొదలుపెట్టారు. వారికి ప్రాక్టికల్ విధానంలో విద్యను అందించారు..లడక్ ప్రాంతంలో శీతకాలంలో వృధాగా పోయే నీటిని మంచు కొండలుగా మార్చే విధానాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ ఐస్ స్తూపాలు వేసవికాలంలో రైతులకు సాగునీటి వనరుల మాదిరిగా ఉపయోగపడతాయి.సోనం ప్రస్తుతం నీట్ అవకతవకలపై ఆందోళన చేస్తున్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఆయన చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దీంతో ప్రధాన మీడియాలో సోనం గురించి విస్తృతంగా చర్చ నడుస్తోంది.

## విల్లాలలో ఆర్ధరాత్రి హంగామా

మేడ్చల్ ,పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక అలమైసన్ గేటెడ్ కమ్యూనిటీ (విల్లాస్ )లో అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు హంగామా సృష్టించారు. తమ విల్లాస్ లో గల పార్కు స్థలంలో ఉన్న బోరుబావి ని రిపేర్ చేస్తున్న క్రమంలో మైనంపల్లి చందర్ రావు మరికొంత మంది కలసి పార్క్ స్థలం తమదని అందులో ఎలాంటి యాక్టివిటీ వేయొద్దు అంటూ ?విల్లాస్ లో ఉండే వారిపై దాడి కి పాల్పడ్డారు. గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న సెక్యూరిటీని సైతం బెదిరించి బైట కొందరి రౌడీ మూకలతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు,ఆడవారు అనే కనీసం మర్యాద లేకుండా ప్రవర్తించారని,ప్రశాంతంగా ఉండటం కోసం విల్లాస్ ను కొనుగోలు చేసి,జీవిస్తుంటే ఇలా తమపై దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. ఈ విషయం పై పోలీసులకి సమాచారం అందడంతో అక్కడ సెక్యూరిటీ గార్డుల పై,స్థానికుల పై దాడి కి యత్నించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయం పై తమకు భద్రత పరమైన ఇబ్బందులు ఉన్నాయని,పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వరి ఉరి అవుతుందా...

నల్గొండ, జూలై 18 (న్యూస్ పల్స్) వరి పంట పెరగడాన్ని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. నిజంగా వరి విస్తీర్ణం బాగా పెరిగింది. కానీ దాని వల్ల రైతుకు.. లేదా మార్కెట్కు ఏమైనా లాభం కలుగుతుందా అంటే.. ఆలోచించాల్సిన అవసరం. వరి పంట మాత్రమే గొప్పదన్నట్లుగా ప్రచారం చేసి..దానికి తగ్గట్లుగా ఇచ్చిన ప్రోత్సాహం వల్ల రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ధాన్యం అమ్ముకోలేని పరిస్థితికి చేరుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో వరి పంట విస్తీర్ణం, దిగుబడి గత పన్నెండేళ్లలో అనూహ్యంగా, ఊహించని రీతిలో పెరిగిందనేది అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్న పరమ సత్యం. తెలంగాణ నేడు దేశంలోనే ధాన్య భాండాగారంగా అవతరించింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 2013-14 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణం కేవలం 20 లక్షల హెక్టార్లు అంటే సుమారు 49 లక్షల ఎకరాలు కాగా, ఉత్పాదకత కేవలం 65.5 లక్షల టన్నులుగా రికార్డయ్యింది.అయితే, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి సర్కారు ప్రోత్సాహకాలతో పన్నెండేళ్లు తిరిగేసరికి 2025-26 నాటికి వరి సాగు ఏకంగా 129.80 లక్షల ఎకరాలకు చేరింది. ప్రస్తుత సీజన్‌లో సుమారు 282 లక్షల టన్నుల రికార్డు వరి ఉత్పత్తితో, దేశంలోనే యాసంగి వరి సాగులో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.కానీ, అంకెల్లో కనిపిస్తున్న ఈ రికార్డుల వైభవం క్షేత్రస్థాయిలో ఉన్న రైతులకు నిజంగానే మేలు చేస్తోందా? అంటే 'లేదు' అనే సమాధానమే వస్తోంది. దేశంలోనే అత్యధిక పంట పండించామంటూ పాలకులు ఢంకా బజాయించుకోవడానికి, రాజకీయంగా గొప్పలు చెప్పుకోవడానికి ఈ వరి బూమ్ బాగానే ఉపయోగపడుతోంది కానీ.. మిగులు దిగుబడితో మార్కెట్ కుప్పకూలి రైతులకు నికర లాభాలు దక్కకుండా పోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఆహార మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా వరి సాగును తగ్గించాలని, నీటి లభ్యత తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని పదే పదే సూచిస్తోంది.అయినప్పటికీ, మన పాలకులు కేవలం "వరి వేయడమే ఒక అద్భుత ప్రగతి" అన్నట్లుగా ప్రచారం కల్పించడంతో.. మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా రైతులంతా ఒకే రకమైన వరి సాగు వైపు గుడ్డిగా అడుగులు వేశారు.ఈ విషయంలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కొంత ముందుచూపుతో వ్యవహరిస్తోందనే చెప్పాలి. ఏపీలో ఉద్దేశపూర్వకంగానే సాంప్రదాయ వరి పంట విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించి, అంతర్జాతీయంగా మంచి గిట్టుబాటు ధరలు లభించే వాణిజ్య పంటలు, ఉద్యానవన తోటలు , ఆయిల్ పామ్ వైపు రైతులను విజయవంతంగా మళ్లిస్తున్నారు. దేశంలోనే రబీ వరి సాగులో తెలంగాణ 59.90 లక్షల ఎకరాల్లో పంట వేస్తే, ఏపీ కేవలం 17.29 లక్షల ఎకరాలకే పరిమితం చేసింది. ఇలా క్రాప్ డైవర్సిఫికేషన్ చేయడం వల్ల ఏపీ రైతులకు డిమాండ్ ఆధారిత గిట్టుబాటు ధర దక్కుతోంది. కానీ తెలంగాణలో మాత్రం మిగులు ధాన్యాన్ని ఏం చేసుకోవాలో తెలియక, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి సేకరించాల్సి వస్తోంది.వాస్తవానికి, వరి పంట

ఎప్పుడూ ఒకే రకమైన ఏకపంట విధానానికి దారితీస్తుంది. ఇది భూగర్భ జలాలను, ఉచిత విద్యుత్‌ను విపరీతంగా అడుగంటించడంతో పాటు దీర్ఘకాలంలో భూసారాన్ని కూడా దెబ్బతీస్తుంది. అంతకంటే ముఖ్యంగా, ఎంత శ్రమించినా అంతిమంగా లభించే కనీస మద్దతు ధర పెట్టుబడి ఖర్చులకు మాత్రమే సరిపోతోంది.మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనెగింజలు, సిరిధాన్యాలు , హై-వాల్యూ ఉద్యానవన పంటల వైపు మన రైతులను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. తృణధాన్యాలు, కమర్షియల్ పంటలకు సరైన మార్కెటింగ్ నెట్‌వర్క్, కోల్డ్ స్టోరేజీలు కల్పించకపోవడం వల్లే నేటికీ సామాన్య రైతు 'వరి' అనే సురక్షితమైన కానీ తక్కువ లాభదాయకమైన వలయంలోనే చిక్కుకుపోవాల్సి వస్తోంది.ఈ సంక్షోభం నుంచి తెలంగాణ వ్యవసాయ రంగం బయటపడాలంటే.. ఇకనైనా కేవలం రికార్డుల కోసం వరి సాగును పెంచడం ఆపి, మార్కెట్ సెంట్రిక్ పంటల వైపు మళ్లక తప్పదు. ఏ పంట వేస్తే రైతు జేబు నిండుతుందో, ఏ పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రేజ్ ఉందో గుర్తించి, వాటికి కూడా పూర్తి స్థాయిలో కొనుగోలు గ్యారెంటీని, రాయితీలను ఇస్తూ పటిష్టమైన పాలసీని తేవాలి. లేనిపక్షంలో, రాష్ట్ర ఖజానాపై 'వరి సేకరణ' భారం పెరిగిపోవడంతో పాటు, దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్నా.. అప్పుల ఊబిలోనే మగ్గిపోయే దుస్థితి తెలంగాణ అన్నదాతకు తప్పదని వ్యవసాయ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మహేష్ గౌడపై వేటు తప్పదా

హైదరాబాద్, జూలై 18 (న్యూస్ పల్స్)తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ అంతర్గత వ్యవహారాలు మాత్రం గాంధీభవన్‌ను కుదిపేస్తున్నాయి. రోజురోజుకూ పెచ్చుమీరుతున్న గ్రూపు రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను సమన్వయపరిచే ఒక సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను మార్చడం ఒక్కటే దీనికి పరిష్కారమనే చర్చ ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది.ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కాంగ్రెస్ హైకమాండ్‌కు తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డులో జూనియర్లకు పదవులు కట్టబెట్టి, పార్టీని నమ్ముకున్న సీనియర్లకు మొండిచేయి చూపించారనే అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తమవుతోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో కనీసం తమకు సమాచారం లేకుండానే నియామకాలు జరగడంపై సీనియర్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్న సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ పూర్తిగా విఫలమయ్యారంటూ సీనియర్లు భావిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించాల్సిన ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌ను గాడిలో పెట్టాలంటే నాయకత్వ మార్పు అనివార్యమనే సంకేతాలు అందుతున్నాయి. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ తీవ్రంగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టి, పార్టీ కేడర్‌లో భరోసా నింపే కొత్త సారథి కోసం అన్వేషణ మొదలైనట్లు టాక్. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, పీసీసీ పగ్గాలు ఎవరికి దక్కుతాయో చూడాలి.తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో ప్రభుత్వ పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో గాంధీభవన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం వల్లే పార్టీలో ఈ అంతర్గత సంక్షోభం ముదురుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డు నియామకంలో తమకు సరైన ప్రాధాన్యత దక్కలేదని, జూనియర్లకు పదవులు కట్టబెట్టారని పార్టీ కోసం ఎప్పటి నుంచో నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో తమకు తెలియకుండానే నియామకాలు జరగడంపై వారు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్నా సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ సామర్థ్యం సరిపోవడం లేదంటూ సీనియర్లు భావిస్తున్నారు. సమస్యల తీవ్రతపై నివేదికలు సిద్ధం చేసి, రాష్ట్ర స్థాయిలోనే సెటిల్ చేయాల్సింది పోయి.. ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలను మార్చాలనే ప్రచారం ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# సేనలో చేరికలు ఎప్పుడు

హైదరాబాద్, జూలై 18 (న్యూస్ పల్స్)తెలంగాణ రక్షణ సేన కవిత పార్టీ పెట్టి నాలుగు నెలలు కావస్తుంది. అయితే ఇప్పటి వరకూ ఎవరూ ఆ పార్టీలో చేరలేదు. ఒకరు ఇద్దరు మినహా కవిత పార్టీలోకి వచ్చేందుకు పెద్దగా ఉత్సాహం చూపడం లేదు. కేసీఆర్ తనయగా కవిత కొత్త పార్టీలో బీఆర్ఎస్ నుంచి పెద్దయెత్తున వలసలు ఉంటాయని భావించారు. కవిత కూడా ఇదే అంచనా వేశారు. కవిత కూడా ఇదే విషయాన్ని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అనేక మంది తనతో టచ్ లో ఉన్నారని చెప్పడంతో ఎవరెవరు చేరతారన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రకటించారు. ఈ సభలోనే తన అజెండాను ప్రకటించారు. అయితే నాలుగు నెలలవుతున్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎవరూ చేరకపోవడంతో ఒకింత ఆమె సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న వారే ఎక్కువ మంది కవిత పార్టీలో ఉన్నారు. గతంలో తెలంగాణ జాగృతి సంస్థలో కీలకంగా ఉన్న వారు మాత్రమే తెలంగాణ రక్షణ సేనలోనూ కీలక భూమిక పోషిస్తున్నారు. చెప్పుకోదగ్గ నేతలు ఎవరూ పార్టీలో చేరలేదు. అయితే కవిత అనుచరులు మాత్రం ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి వేచి చూసి వస్తారని చెబుతున్నారు. మొన్నటి వరకూ కవిత పార్టీలో చేరడానికి కొందరు ఉత్సాహం చూపారు. అందుకు సిద్ధమయ్యారని కూడా తెలిసింది. తమ అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకుని కవిత పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.. కానీ కవిత ఎప్పుడైతే ఇక తాను బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదని తెగేసి చెప్పారో.. అప్పుడు వెనక్కు తగ్గినట్లు సోషల్ మీడియాలో ఎక్కువ కామెంట్స్ వినిపిస్తున్నాయి. కవిత బీఆర్ఎస్ లో చేరితే ఆమె పార్టీ కూడా అందులో విలీనమయితే తమకు ఉపయోగముంటుందని కొందరు అంచనా వేసి వెళదామనుకున్నారు. తాను వెళ్లనని చెప్పడంతో ఇక అక్కడకు వెళ్లి రాజకీయంగా నష్టపోతామేమోనన్న ఆందోళనతో వెనక్కు తగ్గుతున్నారు. మరొకవైపు కవిత త్వరలోనే పాదయాత్ర చేయడానికి సిద్ధమవుతున్నారు. కవిత పార్టీకి కొంత హైప్ వస్తే అప్పుడు చేరికలు వస్తాయని, ఇక ఎన్నికల సమయంలో టిక్కెట్లు రాని వారు బీఫారాలు తీసుకోవడానికి తెలంగాణ రక్షణ సేన వద్దకు వస్తారన్న అంచనాలు కూడా ఉన్నాయి. మొత్తం మీద నాలుగు నెలల నుంచి కవిత పార్టీలో చేరికలు లేకపోవడం రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

## తెలంగాణలో పర్మనెంట్ రెసిడెంట్ సర్టిఫికెట్

హైదరాబాద్ జూలై 18 (న్యూస్ పల్స్)తెలంగాణలో కర్ణాటక రాష్ట్రం తరహాలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం విధానాన్ని ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ వెల్లడించారు. ఈ కొత్త విధానం సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించడానికి ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దీర్ఘకాలంగా నివసిస్తున్న ప్రజలు తమ శాశ్వత నివాసాన్ని సులభంగా నిరూపించుకోవడానికి వీలుగా ఒక ప్రామాణిక ప్రభుత్వ పత్రాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి షబ్బీర్ అలీ వినతిపత్రం సమర్పించారు.షబ్బీర్ అలీ అందించిన ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రాథమికంగా చర్చించారు. కర్ణాటకలో అమలులో ఉన్న పి.ఆర్.సి విధానాన్ని, దాని ఫ్రేమ్‌వర్క్‌ను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అలాంటి వ్యవస్థను తీసుకురావడానికి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. ఓటర్ల వెరిఫికేషన్ సమయంలో పరిశీలించదగిన పత్రాల జాబితాలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం కూడా ఒకటని షబ్బీర్ అలీ గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తి పరిశీలన తర్వాత అధికారికంగా జారీ చేసే పి.ఆర్.సి, ఓటర్లు తమ అర్హతను నిరూపించుకోవడానికి ఒక బలమైన మద్దతు పత్రంగా ఉపయోగపడుతుందని వివరించారు.

# బాదం ఎలా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదంటే..!!



బాదం. యాంటీ ఆక్సిడెంట్. ఇందులో అనేక రకాలు పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక వ్యాధుల నుండి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. అందుకే బాదం పప్పు ఆరోగ్యానికి చాలా ప్రయోజ నకరంగా భావిస్తారు. బాదం లో ఫైబర్, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్–ఇ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కడుపు ఆరోగ్యానికి, ఎముకలకు, జుట్టుకు ఉపయోగపడతాయని చెబుతారు. కానీ, బాదం అందరికీ సరిపోదు. కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బాదం తినకపోవడం మంచిది. ఎవరు బాదం తినకూడదో నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. ఆరోగ్య పరంగా బాదం మేలు చేస్తుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మెరుగైన జీర్ణక్రియను నిర్వహించడంలో చాలా సహాయకారిగా ఉంటుంది. మలబద్ధకం నుండి ఉ పశమనం కలిగిస్తాయి. పేగులను శుభ్రంగా ఉంచుతాయి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు 5 నుండి 7 బాదంపప్పులను శుభ్రమైన నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఖాళీ కడుపుతో బాదం పప్పు తినడం వల్ల చాలా ప్రయోజనాలు లభిస్తాయి. కానీ వాటిని త్వరగా మింగేయకుండా బాగా నమిలి తినాలని నిపుణులు చెబుతున్నారు. బాదంపప్పులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రోజూ బాదం తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

బాదంలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్.. శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. వారికి ఊహించని దెబ్బ..!! నిపుణుల సూచనలు బాదంలో ప్రత్యేకంగా రైబోఫ్లేవిన్, ఎల్–కార్నిటైన్ అనే పోషకాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. మెదడు నిత్యం చురుగ్గా ఉండేలా సాయం చేస్తాయి. అయితే.. నిపుణుల ప్రకారం, మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నవారు, జీర్ణ సమస్యలు ఉన్నవారు, అధిక రక్తపోటుకు మందులు వాడుతున్నవారు బాదం తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలగవచ్చు. చాలామందికి బాదం శరీరానికి వేడి ఇవ్వడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఉపయోగ పడు తుంది. కానీ, బాదం తిన్న తర్వాత కడుపు నొప్పి, గ్యాస్ లేదా మొటిమలు వస్తే వెంటనే జాగ్రత్త పడాలి. కిడ్నీ సమస్యలు ఉన్నవారు బాదం తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే బాదంలో ఫాస్ఫరస్, ఆక్సలేట్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. కొన్ని యాంటీబయాటిక్ మందులు వాడుతున్నవారు వైద్యుల సలహా మేరకు బాదం తీసుకుంటే మంచిది.



# గ్రీన్ టీ రెగ్యులర్ గా తాగుతున్నారా – ఇది తెలుసుకోవాల్సిందే..!!



గ్రీన్ టీ వినియోగం పెరిగింది. గ్రీన్ టీ అనేక రకాల ప్రయోజనాలు అందిస్తోంది. ఆరోగ్య పరంగానూ మేలు చేస్తుంది. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం గ్రీన్ టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. చాలామంది ఉదయం నిద్రలేచాక గ్రీన్ టీతోనే రోజును ప్రారంభిస్తారు.అయితే, గ్రీన్ టీ విషయంలో కొన్ని జాగ్రత్తలు తప్పని సరి. లేదంటే సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తు న్నారు. కొన్ని ఆరోగ్య పరమైన సమస్య లు ఎదుర్కొంటున్న వారు సైతం గ్రీన్ టీ కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. గ్రీన్ టీ వినియోగించే సమయాల పైనా స్పష్టత ఇస్తున్నారు. గ్రీన్ టీ పరిమితంగా.. నిర్దేశించిన సమయాల్లో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బరువు తగ్గే ప్రయత్నాల్లో ఉన్నవారు, డీటాక్స్ కోసం ప్రయత్నించే వారు ఎక్కువగా తాగుతారు. చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచు తుంది. చెడు కొలె స్ట్రాల్‌ను క్లియర్ చేస్తుంది. గ్రీన్ టీలో ఫ్రీ రాడికల్స్‌ను నివారించే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మెటబాలిజంను పెంచి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరాన్ని డీటాక్స్ చేసి శక్తిని ఇస్తుంది. మెదడును ఉ త్తేజ పరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇవన్నీ మేలు చేసేవి కాగా, ఉదయం వేళ ఖాళీ కడుపున తీసుకునే వారికి సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రీన్ టీలో టానిన్లు ఉంటాయి. ఇవి కడుపు ఆమ్లతను పెంచుతాయి. మీకు వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అయితే, ఉదయం ఖాళీ కడుపున తీసుకోవడం వల్ల మన కడుపులో యాసిడ్ స్థాయిలు పెరిగి..అజీర్తి చేసే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. నిపుణుల సూచనలు అదే విధంగా ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగడం వల్ల జీర్ణక్రియ మందగించే అవకాశం ఉంది. ఇది గ్యాస్ట్రిక్, యాసిడిటీ వంటి సమస్యలు రావొచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగితే కడుపులో యాసిడ్ స్థాయి పెరిగి గ్యాస్, మలబద్ధకం, మైగ్రేన్ వంటి సమస్యలు రావచ్చని వైద్యులు చెబుతున్నారు. ఖాళీ కడుపున కాకుండా.. భోజనం తర్వాత లేదా టిఫిన్‌తో పాటు గ్రీన్ టీ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. ఇదే సమయంలో దాని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పూర్తిగా ప్రభావితం కావడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.?గ్రీన్ టీలోని టానిన్లు శరీరంలో ఐరన్ శోషణను అడ్డుకుంటాయి. దీంతో, రక్తహీనత సమస్యతో బాధపడేవారు గ్రీన్ టీకి దూరంగా ఉండాలి. రక్తహీనత సమస్య ఉన్నవారు గ్రీన్ టీ తాగడం వల్ల ఐరన్ లోపం మరింత ఎక్కువ కావచ్చు. ఇప్పటికే లివర్ సమస్యలతో బాధపడేవారు గ్రీన్ టీకి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అధిక మోతాదులో గ్రీన్ టీ తీసుకోవడం వల్ల లివర్‌పై ప్రతికూల ప్రభావం ఉండవచ్చని చెబుతున్నారు.

# రెస్టారెంట్ స్టైల్ “బెండకాయ పకోడీ” ఎప్పుడైనా తిన్నారా..?

బెండకాయ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కూరగాయ. దీనిని ఇంగ్లీషులో ఓక్రా లేదా లేడీస్ ఫింగర్ అని అంటారు. ముఖ్యంగా భారతీయ వంటకాల్లో కూడా బెండకాయని ఎక్కువగా ఉపయోగిస్తారు. అందులో ఉండే పోషక విలువలు అధికంగా ఉండడం.. సులభంగా జీర్ణమయ్యే గుణం కారణంగా దీనిని తరచుగా ఆహారంలో చేర్చుతారు. అయితే బెండకాయ అంటే చాలామందికి ఇష్టముండదు. బెండకాయ బంకగా ఉంటుందని.. రుచి ఉండదని ఎక్కువ మంది తినడానికి ఆసక్తి చూపరు. కానీ కొందరు మాత్రం బెండకాయ వేపుడు మాత్రమే తింటుంటారు. ఈ తరహా విషయాలు అన్నింటికీ చెక్ పెడుతూ పిల్లలకి అయిన పెద్దలకు అయినా కానీ ఇష్టంగా బెండకాయ తినిపించేందుకు బెస్ట్ ప్లాన్ ఇదే. అదే బెండకాయ పకోడీ.. అయితే వాళ్లకు నార్మల్? ఉల్లిపాయ పకోడీతో పోలిస్తే బెండకాయలతో చేసినవి మంచి రుచికరంగా ఉంటాయి. తయారు చేసుకోవడం కూడా సులువే. ఈ కమ్మని బెండకాయ పకోడీ ఎలా చేసుకోవాలో మీకోసం ప్రత్యేకంగా.. కావాల్సిన పదార్థాలు.. బెండకాయలు – అర కేజీ శనగపిండి – ఒకటిన్నర కప్పులు ఉప్పు – రుచికి సరిపడా మసాలా – అర టీస్పూన్?ధనియాల పొడి – 1 టీస్పూన్?పసుపు – అర టీస్పూన్?కారం – ఒకటిన్నర కప్పులు నిమ్మరసం – 2 టీస్పూన్లు తయారీ విధానం.. ముందుగా బెండకాయలను శుభ్రంగా కడిగి తడి లేకుండా తుడుచుకుని రెండు వైపులా చివర్లు కట్? చేసుకోవాలి. అనంతరం ఒక బెండకాయ తీసుకుని పొడుగ్గా సగానికి కట్? చేసుకోవాలి. అనంతరం ఒక భాగాన్ని సన్నగా పొడుగ్గా కట్? చేసి మధ్యలోకి కట్? చేసుకోవాలి. బెండకాయ ముక్కల్లోకి శనగపిండి, ఉప్పు, గరం మసాలా, ధనియాల పొడి, పసుపు, కారం, నిమ్మరసం, 1 టేబుల్?స్పూన్? నూనె పోసి అంతా కలిసేలా మిక్స్? చేసుకోవాలి. ఆ తర్వాత కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుని పకోడీ పిండి కన్సిస్టెన్సీ వచ్చేలా కలుపుకుని పక్కన ఉంచాలి. స్టవ్? ఆన్? చేసి కడాయి పెట్టి డీప్?ఫ్రైకి సరిపడా నూనె పోసి వేడి చేసుకోవాలి. నూనె కాగినాక మంటను సిమ్?లో పెట్టి కలిపి పెట్టుకున్న బెండకాయ ముక్కలను విడివిడిగా నూనెలో వేసుకోవాలి. కడాయికి సరిపడా వేసుకున్నాక మంటను మీడియం ఫ్లేమ్?లో పెట్టి నిధానంగా తిప్పుతూ వేయించుకోవాలి. బెండకాయ ముక్కలు క్రిస్పీగా వేగినాక తీసి టిష్యూ పేపర్? ఉన్న ప్లేట్?లోకి తీసుకోవాలి. ఇలానే మిగిలిన బెండకాయ ముక్కలను కూడా నూనెలో వేయించి వేడివేడిగా సర్వ్? చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే బెండకాయ పకోడీ రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి. చిట్కాలు.. బెండకాయలు లేతవి తీసుకుంటే పకోడీ టేస్ట్? బాగుంటుంది. పకోడీలు మరింత క్రిస్పీగా ఉండాలనుకుంటే కాస్త బియ్యప్పిండి కూడా యాడ్? చేసుకోవచ్చు. బెండకాయ ముక్కలను కలపడానికి నీటిని ఎక్కువ యూజ్? చేయకూడదు.

# బరువు తగ్గి, షుగర్ కంట్రోల్ లో ఉండాలా..? ఈ హెల్దీ రెసిపీ మీ కోసమే..!



ఈ రోజుల్లో బరువు పెరగడం అనేది సర్వ సాధారణ సమస్యగా మారింది. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయం సమస్యతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం, పని ఒత్తిడి, హార్మోన్ లో సమతుల్యత లోపం, స్ట్రీట్ ఫుడ్ అధికంగా తినడం ఇలా అనేక కారణాలతో అటు ఊబకాయంతో పాటు చిన్న వయసులోనే చాలామంది షుగర్ వ్యాధి బారిన పడుతున్నారు. అయితే సరైన డైట్ తో పాటు నిరంతరం వ్యాయామాలు చేయడం ద్వారా ఈ సమస్యలను అధిగమించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఆరోగ్యం కోసం చాలా మంది ఫుడ్ అలవాట్లను మార్చుకున్నారు. టిఫిన్స్ లో ఇప్పుడు కొర్రల కిచిడీని తయారు చేసుకుంటున్నారు. అయితే చాలామందికి కొర్రల కిచిడీ తయారు చేసుకోవడం తెలియదు. మరి సూపర్ టేస్టీ కొర్రల కిచిడీని ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం.. కొర్రల కిచిడీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే కొర్రలు ఒక కప్పు, పెసరపప్పు అర కప్పు, క్యారెట్ ముక్కలు అర కప్పు, బఠాణీలు పావు కప్పు, ఉల్లిపాయలు ఒకటి తరిగినది, పచ్చిమిర్చి రెండు లేదా మూడు చీల్చినవి, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక స్పూన్, కరివేపాకు ఒక రెమ్మ, నెయ్యి లేదా నూనె మూడు టేబుల్ స్పూన్ లు, తాళింపు దినుసులు(ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి), ఉప్పు తగినంత, నీరు మూడు కప్పులు తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే ముందుగా కొర్రలు, పెసరపప్పును కడిగి 30 నిమిషాల పాటు నానబెట్టుకోవాలి. ఆ తర్వాత కుక్కర్ లో నెయ్యి వేసి అందులో తాళింపు దినుసులు, కరివేపాకు వేయాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత అందులోనే కూరగాయ ముక్కలు అయిన క్యారెట్, బఠాణీ వేసి మరికొద్దిసేపు వేయించుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన కొర్రలు, పప్పు అలాగే సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. అందులోనే 3 కప్పుల నీరు పోయాలి. ఇప్పుడు మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. చివరగా ఆ మిశ్రమంపై కొత్తిమీరతో గార్నిష్ చేయాలి. ఆ తర్వాత వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి. అంతే సూపర్ టేస్టీ కొర్రల కిచిడీ రెడీ అయినట్టే..

# వారానికి ఒక్క ఇంజెక్షన్‌తో అదుపులోకి మధుమేహం – ధరలు, వినియోగం..!!



డయాబెటిస్ బాధితులకు బిగ్ రిలీఫ్. ఇప్పటి వరకు ప్రతీ రోజు ఇన్సులిన్ చేసుకుంటున్న వారికి ఇక ఆ సమస్యలు ఉండవు. వారానికి ఒక సారి మాత్రమే ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. దీనికి సంబంధించిన కొత్త ఇంజెక్షన్ మార్కెట్ లోకి ప్రవేశించింది. ఇది ప్రపంచంలోనే తొలి వారానికి ఒక్కసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్ ఇంజెక్షన్. టైపక -1, టైప్ -2 డయాబెటిక్ బాధితులకు ఈ ఇంజెక్షన్ ప్రయోజనకంగా ఉండనుంది. మధుమేహ బాధితులకు ఇక ప్రతీ రోజు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకొనే అవసరం లేకుండా వారం లో ఇక సారి మాత్రమే తీసుకొనే కొత్త ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. కొత్త బేసల్ ఇన్సులిన్ అవిక్లీ (ఇన్సులిన్ ఐకోడెక్)ను భారత్‌లో విడుదల చేసారు. ఈ ఇంజెక్షన్ వారానికి ఒకటి మాత్రమే అవసరం కావటంతో.. ప్రతీ ఏటా 365 ఇంజెక్షన్లు చేయించుకోవాల్సిన వారు.. ఇక నుంచి 52 చేయిస్తే సరిపోతుంది. టైప్–1, టైప్–2 మధుమేహంతో బాధపడుతున్న వారికి ఈ ఇంజెక్షన్ వినయోగానికి అనుమతి దక్కింది. భారత్ లో వేగంగా షుగరు వ్యాధి పెరుగుతోంది. దాదాపు 10.01 కోటి మంది మధుమేహంతో సహవాసం చేస్తున్నారు. వారిలో దాదాపు 70 శాతం మంది బాధితులు ఇన్సులిన్ వినియోగిస్తున్నారు. మిగిలిన వారు టాబ్లెట్లతో నెట్టుకొస్తున్నారు. ఇక, ఇప్పుడు వారానికి ఇక్క సారి మాత్రమే తీసుకునే ఈ బేసల్ ఇంజెక్షన్ అందుబాటులోకి రావటంతో... వారు సైతం ఈ ఇంజెక్షన్ల వినియోగం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందుబాటు ధరల్లోనే అవిక్లీ ధరలను భారత్ లో ఖరారు చేసారు. ఇక్కడి మార్కెట్ కు అనుగుణంగా ధరలను ఫిక్స్ చేసిన తయారీ సంస్థ నోవో నోర్డిస్క్ వెల్లడించింది. 700 ఇన్సులిన్ యూనిట్లు కలిగిన 1 మిల్లీలీటర్ అవిక్లీ పెన్ ధరను రూ.2,611గా నిర్ణయించారు. అదే విధంగా 2,100 యూనిట్లు కలిగిన 3 మిల్లీలీటర్ పెన్ ధర రూ.7,883గా ఫిక్స్ చేసారు. వారానికి 70 యూనిట్ల మోతాదు తీసుకునే రోగికి ఈ చికిత్స ఖర్చు వారానికి దాదాపు రూ.261 నుంచి రూ.263 వరకు ఉండే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుతం లాభాల కంటే.. ఎక్కువ మంది వినియోగించే చేయటమే తమ ప్రధాన లక్ష్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఇంజెక్షన్ షుగరు వ్యాధి బాధితులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో.. ఇక్కడా వినియోగం పెరిగితే.. వచ్చే ఫలితాల ఆధారంగా మరింత గా అమ్మకాల ప్రభావం ఉంటుందని పేర్కొంటున్నారు.

## 'రాగి ఆవిరి కజ్జికాయలు'.. ఇలా చేస్తే జ్యూసీజ్యూసీగా ఉంటాయి..!

కజ్జికాయలు అనగానే చాలామందికి నోరూరుతుంది. కజ్జికాయలు రుచిగా ఉండటంతోపాటు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. పైన క్రంచీగా, లోపల జ్యూసీగా ఉండే కజ్జికాయలను పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఇష్టంగా తింటుంటారు. ఇక పండగలు, శుభకార్యాల సమయంలో అయితే ప్రతి ఒక్కరూ వీటిని తయారు చేస్తుంటారు. అయితే కజ్జికాయల్లో కొన్ని రకాలు ఉంటాయి. పాకం కజ్జికాయలు, కోడిగుడ్డు కజ్జికాయలు, నువ్వుల కజ్జికాయలు, డ్రైఫ్రూట్స్ కజ్జికాయలు, కోవా కజ్జికాయలు ఇలా అనేక రకాలుగా ఉంటాయి. కానీ మీరు ఎప్పుడైనా రాగి ఆవిరి కజ్జికాయలను టేస్ట్ చేశారా..? ఇవి చాలా రుచిగా ఉంటాయి. అంతేకాక వీటిని తింటే పోషకాలు లభిస్తాయి. మరి ఈ రాగి ఆవిరి కజ్జికాయలు ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. రాగి ఆవిరి కజ్జికాయలు తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే ముందుగా రాగిపిండి ఒక కప్పు, నీరు ఒక కప్పు, ఉప్పు చిటికెడు, నూనె లేదా నెయ్యి ఒక టేబుల్ స్పూన్, తురిమిన ఎండు కొబ్బరి ఒక కప్పు, తురిమిన బెల్లం ఒక కప్పు, యాలకుల పొడి ముప్పావు కప్పు, నెయ్యి ఒక టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఇప్పుడు తయారీ విధానం చూస్తే ముందుగా ఒక గిన్నెలో తురిమిన ఎండు కొబ్బరి, బెల్లం, యాలకుల పొడి, నెయ్యి వేసి అన్నీ బాగా కలిసేలా మిక్సింగ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక గిన్నెలో నీరు, చిటికెడు ఉప్పు, నెయ్యి వేసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు రాగిపిండిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి.

ఇయ్యాల తెలంగాణ



## ముద్రగడ ఫ్యామిలీ ఫ్యూచర్ ఏంటీ

కాకినాడ, జూలై 17 దశాబ్దాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తన సంచలన నిర్ణయాలతో, సుదీర్ఘ సామాజిక పోరాటాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం మృతితో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. అయితే, ఆయన జీవిత చరమాంకంలో, అంత్యక్రియల వేళ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నడిపిన రాజకీయ వ్యూహాలు ఆయన కుటుంబానికి కనీస ప్రశాంతత లేకుండా చేశాయి. జీవించి ఉన్నంత కాలం ముద్రగడ చేత సుదీర్ఘ లేఖలు రాయించి, తమ పొలిటికల్ అజెండా కోసం ఆయన ఇమేజ్‌ను వాడుకున్న వైసీపీ.. ఇప్పుడు ఆయన లేని తరుణంలో ఆ కుటుంబాన్ని పట్టించుకుంటుందా అన్న చర్చ నడుస్తుంది.గత ఎన్నికల ముందు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరిన నాటి నుండి, ఆయనను పూర్తిగా ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించే ఒక రాజకీయ ఆయుధంగానే అధినాయకత్వం వాడుకుందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కూటమి నేతలపై లేఖల అస్త్రాలు సంధించడానికి, కుల సమీకరణలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి నాటి అధికార పార్టీ ఆయనకు ప్రాధాన్యతనిచ్చింది. కానీ, ఇప్పుడు ఆయన భౌతికంగా లేరు. ముద్రగడ రాజకీయ వారసత్వాన్ని మోయాల్సిన ఆయన కుమారుడు గిరిబాబు ప్రస్తుతానికి రాజకీయంగా అంత యాక్టివ్‌గా లేరు, పైగా ఆర్థికంగానూ పటిష్టమైన స్థితిలో లేరనే గుసగుసలు కిర్లంపూడి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి బలహీనమైన తరుణంలో వైసీపీ ఆ కుటుంబాన్ని ఎంతవరకు ఆదుకుంటుందనేది పెద్ద ప్రశ్నార్థకమే.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిని దగ్గరుండి గమనించిన ఎవరికైనా ఒక విషయంపై పూర్తి స్పష్టత ఉంటుంది. తమకు రాజకీయంగా అవసరం ఉన్నంత కాలమే ఎవరికైనా రెడ్ కార్పెట్ పరుస్తారని, ఒకసారి ఆ అవసరం తీరిపోయాక వారిని కరివేపాకులా తీసిపారేస్తారనే విమర్శలు పార్టీలోనే బలంగా ఉన్నాయి. గతంలో పార్టీ కోసం కష్టపడిన ఎందరో సీనియర్ల కుటుంబాలను జగన్ రెడ్డి ఎలా పక్కన పెట్టారో ఉదాహరణలు కళ్లముందే ఉన్నాయి. ఇప్పుడు ముద్రగడ కుటుంబం విషయంలోనూ ఇదే రిపీట్ కాబోతోందని, జగన్ కానీ, వైసీపీ టాప్ లీడర్‌షిప్ కానీ ఇకపై ముద్రగడ కుటుంబాన్ని పెద్దగా పట్టించుకునే ప్రసక్తే లేదని అంటున్నా?.ప్రస్తుతానికి ముద్రగడ మృతి పట్ల వైసీపీ నేతలు సానుభూతి ప్రకటిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో వారి అసలు రంగు బయటపడుతుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ముద్రగడ వారసులకు అసెంబ్లీ లేదా పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చే ఉద్దేశం జగన్ మోహన్ రెడ్డికి అస్సలు లేదు. కష్టకాలంలో జెండా మోసేవారికే దిక్కులేని వైసీపీలో, కేవలం ఎన్నికల ముందు వచ్చి చేరిన సీనియర్ నేత కుటుంబానికి భవిష్యత్తు సీట్ల కేటాయింపుల్లో అగ్రతాంబూలం ఇస్తారని అనుకోవడం ముమ్మాటికీ అమాయకత్వమే అవుతుంది. ఇప్పుడున్న సానుభూతి పవనాలు చల్లారిన తర్వాత, సరిగ్గా మరో ఆరు నెలలకో లేదా ఏడాదికో ముద్రగడ కుటుంబానికి వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత దక్కుతుందో, ఎన్ని అవమానాలు ఎదురవుతాయో అందరూ ప్రత్యక్షంగా చూస్తారని వేసీపీ నేతలే జోస్యం చెబుతున్నారు

## ఖరీఫ్ ఆశల గల్లంతు

కర్నూలు జూలై 18 ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఎప్పటి నుంచో వెన్నెముకగా నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఐటీ , పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టినా, ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం వ్యవసాయమే. అయితే ఈ ఏడాది ఎల్ నినో ( ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పంటల సాగు ప్రారంభం కావాల్సిన సమయంలోనే వానలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి నెలకొంది.సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేను రోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతం లోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది.రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడం, చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది.ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు లేకపోవడం మాత్రమే కాకుండా, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో విత్తనాలు వేయడానికి కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తిపై మాత్రమే కాకుండా గ్రామీణ ఉపాధి, రైతుల ఆదాయం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.వాతావరణ పరిస్థితులు త్వరగా మారి జూలై రెండో పక్షంలో అయినా మంచి వర్షాలు కురిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడే అవకాశముందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి.



# కూటమికి టిక్కెట్ల సవాల్

విజయవాడ, జూలై 18 ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

## పోలవరానికి పర్యాటక శోభ

రాజమండ్రి, జూలై 18 ఆంధ్రప్రదేశ్‌లో పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తోపాటు గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతోపాటు ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డెవల్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారలుతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు.నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు.పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు.ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవల్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ.. వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువున నది మధ్యలో 500 ఎకరాల ఐ లాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది.ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

## పెందుర్తిలో మూడు ముక్కలాట

విశాఖపట్టణం, జూలై 18 విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు కలిగిన స్థానం. 1979లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం నుంచి పలువురు ప్రముఖ నాయకులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాష్ట్ర రాజకీయాల్లో తమ ముద్ర వేశారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ నాయకులు కూడా ఇక్కడి నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంపై ప్రధాన పార్టీల దృష్టి ఎక్కువగా ఉంటుంది.నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పరవాడ మండలం పెందుర్తి పరిధిలోకి రావడంతో రాజకీయ సమీకరణాలు కూడా మారాయి. ఆ సమయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తన రాజకీయ కేంద్రాన్ని పెందుర్తికి మార్చుకున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన విజయం సాధించినప్పటికీ, 2009 మరియు 2019 ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారు. అనంతరం 2024 ఎన్నికల సందర్భంగా ఆయనను మాడుగుల నియోజకవర్గానికి మార్చగా, కూటమి ఒప్పందంలో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేన కి కేటాయించారు. అక్కడ నుంచి పంచకర్ల రమేష్ బాబు విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.అయితే భవిష్యత్ రాజకీయాలపై బండారు సత్యనారాయణమూర్తి ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమారుడు బండారు అప్పలనాయుడును రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. అందుకే తమ కుటుంబానికి బలమైన పట్టున్న పెందుర్తి నుంచే ఆయనను బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. 2029 ఎన్నికల్లో తన వారసుడికి అవకాశం కల్పించి, అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరం కావాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పెందుర్తిలో పార్టీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తన అనుచరులను ఏకతాటిపై ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.మరోవైపు టీడీపీ లోనే మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కూడా ఇదే స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన తర్వాత టీడీపీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. ప్రస్తుతం పార్టీ ఆయనకు పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు నామినేటెడ్ పదవిని కూడా అప్పగించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తనకే అవకాశం వస్తుందనే నమ్మకంతో ఆయన తన వర్గాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని చెబుతున్నారు. దీనితో టీడీపీలోనే రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో జనసేన కూడా ఈ స్థానాన్ని తమకు కీలకమైన నియోజకవర్గంగా భావిస్తోంది. ప్రజారాజ్యం పార్టీ కాలంలో తొలిసారి ఈ ప్రాంతంలో విజయం సాధించిన పంచకర్ల రమేష్ బాబు, 2024లో జనసేన అభ్యర్థిగా మరోసారి గెలిచి తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు. అందువల్ల 2029 ఎన్నికల్లో కూడా ఆయననే బరిలో దింపాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గం కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కేంద్రంగా మారింది. టీడీపీలోనే నాయకుల మధ్య టికెట్ పోటీ ఉండగా, జనసేన కూడా ఈ స్థానాన్ని వదులుకునే పరిస్థితిలో కనిపించడం లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ సీటు ఏ పార్టీకి దక్కుతుంది, ఎవరు అభ్యర్థిగా నిలుస్తారు అనే అంశం ఇప్పటి నుంచే రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## టీడీపీలోకి వాసిరెడ్డి...



విజయవాడ జూలై 18 వైసీపీ నుంచి బయటకు వచ్చిన మహిళా నాయకురాలు.. వాసిరెడ్డి పద్మకు పొలిటికల్‌గా లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. తాజాగా మంత్రి నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. దీంతో త్వరలోనే ఆమె టీడీపీ కండువా కప్పుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతి విషయంలోనూ దూకుడుగా ఉండే వాసిరెడ్డి పద్మ దాదాపు 20 ఏళ్లకుపైగానే రాజకీయాల్లో కొనసాగుతున్నారు.వైసీపీ అధికార ప్రతినిధిగా.. ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించినా.. జగన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం.. వైసీపీ నుంచి బయటకు వచ్చిన పద్మ.. సంచలన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. జగన్ కారణంగానే అందరూ ఓడిపోయారని అన్నారు. పార్టీని నడిపించడం.. నాయకులను సమన్వయం చేయడం కూడా రాదని పద్మ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి బయటకు వచ్చిన ఆమె.. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరకుండా మౌనంగా ఉన్నారు. సుమారు ఏడాదిన్నరగా మౌనంగా ఉన్న పద్మ.. తాజాగా టీడీపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. ఆయన పనితీరు, మంత్రి వర్గంలో వ్యవహరిస్తున్న తీరునుకొనియాడారు.అయితే.. ఇప్పటికిప్పుడు వాసిరెడ్డి చేరికపై పార్టీలో ఎలాంటి ప్రకటన రాలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పద్మకు అవకాశం దక్కుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. పైగా వచ్చే ఎన్నికల నాటికి మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న దరిమిలా వాసిరెడ్డికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు కూడా మంచి అవకాశం చిక్కే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## సేనతో నేను..

గుంటూరు, జూలై 18, జనసేన పార్టీ స్థానిక ఎన్నికల కోసం సమాయత్తమవుతుంది. సెప్టంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లో జరగనున్నాయి. దీంతో జనసేన అప్రమత్తమయింది. కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను తొలగించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చర్చా వేదిక కార్యక్రమాన్ని నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్న నినాదంతో కార్యకర్తల్లో తిరిగి ఉత్సాహం నింపేందుకు ఆ పార్టీ ఈ కార్యక్రమం డిజైన్ చేసిందని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు ఎదురవుతున్న సవాళ్లపై పార్టీ దృష్టి పెట్టిందని అనుకోవాలి. నియోజకవర్గాల వారీగా చర్చా వేదికను ఏర్పాటు చేసి కార్యకర్తల మనసులో మాటను విని వారి సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స జరగడంతో ఈ బాధ్యతను మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్నారు. జనసేన లో ఏ గ్రూపులు ఉండవని, పవన్ కల్యాణ్ గ్రూపు ఒక్కటే ఉంటుందని కార్యకర్తలకు చెబుతున్నారు. ఈ వేదిక ద్వారా నాయకులు, కారకర్తల సమన్వయం కుదర్చడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. జనసేన పార్టీకి క్రియాశీలక సభ్యత్వం 24 లక్షల మార్క్ కు చేరుకుంది. నియోజకవర్గాల్లో జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు విని వాటిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వనున్నారు. . స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్ లెవెల్ లో నిలబడి పార్టీకి ఓటు వేయించాలంటే కార్యకర్త ఉత్సాహంగా ఉండాలి. ఆ ఉత్సాహం నింపేందుకే ఈ కార్యక్రమం అనుకోవాలి. పవన్ కల్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉండకపోవచ్చు. అందుకే ముందు నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలంటే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి నాయకత్వం దగ్గరగా ఉందని భరోసా ఇవ్వగలిగితే చాలా వరకూ ప్రయోజనం ఉంటుంది.




# ఫిఫాలో 64 జట్లు.. భారత్‌కు అవకాశం వస్తుందేమో కానీ!: బైచుంగ్ భుటియా


ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్ల సంఖ్యను 64కు పెంచితే భారత్‌కు అర్హత సాధించే అవకాశాలు మెరుగుపడతాయని భారత ఫుట్‌బాల్ దిగ్గజం బైచుంగ్ భుటియా అభిప్రాయపడ్డాడు. అయితే జట్ల సంఖ్య పెరిగిందని మాత్రమే భారత్‌కు వరల్డ్ కప్ బెర్త్ ఖాయమవదని, దేశీయ ఫుట్‌బాల్ వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని అతడు స్పష్టం చేశాడు. అదే సమయంలో ఈ నిర్ణయం వరల్డ్ కప్ నాణ్యతను దెబ్బతీసే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించాడు.'భారత ఫుట్‌బాల్ అభిమానిగా, ఒక ప్లేయర్‌గా చూస్తే 64 జట్లతో వరల్డ్ కప్ నిర్వహించడం స్వాగతించదగ్గ నిర్ణయమే. 48 జట్లతో పోలిస్తే 64 జట్లు ఉంటే భారత్‌కు అర్హత సాధించే అవకాశాలు పెరుగుతాయి. కానీ అంత మాత్రాన భారత్ ఆటోమేటిక్‌గా వరల్డ్ కప్‌నకు చేరుతుందని చెప్పలేం. గ్రాస్‌రూట్ స్థాయి నుంచి వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎక్కువ మంది పిల్లలను ఫుట్‌బాల్ వైపు ఆకర్షించాలి. ప్రతిభావంతులైన ఆటగాళ్లను తీర్చిదిద్దాలి. ముందుగా అండర్-17, అండర్-20 ప్రపంచ కప్‌లకు నిరంతరం అర్హత సాధించే స్థాయికి చేరుకోవాలి. ఉజ్బెకిస్థాన్, మొరాకో వంటి దేశాలు ఇదే విధానాన్ని




అనుసరించి విజయమంతమయ్యాయి' అని భుటియా వివరించాడు.భారత పురుషుల జట్టుతో పోలిస్తే మహిళల జట్టుకు వరల్డ్ కప్ అర్హత సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భుటియా అభిప్రాయపడ్డాడు. 2031 మహిళల వరల్డ్ కప్‌లో జట్ల సంఖ్యను 32 నుంచి 48కు పెంచనున్న నేపథ్యంలో భారత్‌కు అవకాశం మెరుగవుతుందని ఆయన చెప్పారు. 'మహిళల ఫుట్‌బాల్‌పై మరింత పెట్టుబడి పెట్టాలి. ఇండియన్ ఉమెన్స్ లీగ్‌లో జట్ల సంఖ్య పెరగాలి. వయోపరిమితి వారీగా లీగ్‌లు నిర్వహించాలి. గ్రాస్‌రూట్ స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి. మహిళా ప్లేయర్లకు పూర్తి స్థాయి వృత్తి పరమైన అవకాశాలు కల్పిస్తేనే వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెలను ఫుట్‌బాల్ వైపు ప్రోత్సహిస్తారు' అని సూచించాడు.2030 ఫిఫా వరల్డ్ కప్‌ను 64 జట్లతో నిర్వహించాలని దక్షిణ అమెరికా ఫుట్‌బాల్ సమాఖ్య (కాన్‌మెబోల్) ప్రతిపాదించగా, దీనిపై ఫిఫా ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. 2026లో 48 జట్లతో వరల్డ్ కప్ కొనసాగుతోంది. ఈ టోర్నీ అనంతరం ఆ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే.

# మెస్సిని ఇంటర్వ్యూ చేసిన టెన్నిస్ దిగ్గజం జకోవిచ్..

ఇద్దరు దిగ్గజ క్రీడాకారులు ఒకే వేదికపై కలిస్తే.. ఆ సంభాషణలో ప్రత్యేకత ఉండాల్సిందే. ఫిఫా ప్రపంచ కప్ 2026 ఫైనల్ పోరుకు ముందు అలాంటి ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సిని.. టెన్నిస్ స్టార్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ ఓ కార్యక్రమంలో భాగంగా ఇంటర్వ్యూ చేశాడు. ఈ సందర్భంగా జకోవిచ్ అడిగిన ఓ ప్రశ్నకు మెస్సి ఇచ్చిన సమాధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ప్రపంచ స్థాయి పోటీల్లో ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్న జకోవిచ్.. మెస్సిని కూడా అదే అంశంపై ప్రశ్నించాడు. 'ఒత్తిడిని పక్కన పెట్టి మీ సహజమైన ఆటతీరును ఎలా కొనసాగించగలుగుతున్నారు?' అని జకోవిచ్ మెస్సిని అడిగాడు. 'ఒత్తిడి గురించి నేను ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించలేదు. మైదానంలోకి వెళ్లడం, ఆటను ఆస్వాదించడం, పోటీ పడటం సహజమైన విషయాలుగా భావించాను. మేం ఎప్పుడూ గెలవాలని కోరుకుంటాం. కానీ ఇది ఒక ఆట అని కూడా తెలుసు. ప్రత్యర్థి కూడా




ఆడతాడు. ప్రతిసారీ ఒకే వ్యక్తి, ఒకే జట్టు విజయం సాధించడం సాధ్యం కాదు' అని మెస్సి సమాధానం ఇచ్చాడు.కెరీర్‌లో ఓటములను అంగీకరించడం నేర్చుకోవాలని మెస్సి తెలిపాడు. అదే తనను ఆటగాడిగా, వ్యక్తిగా మరింత బలంగా మార్చిందని వెల్లడించాడు. 'కాలక్రమేణా ఒక విషయం అర్థమైంది. క్రీడల్లో మీరు గెలిచే దాని కంటే ఓడిపోయే సందర్భాలే ఎక్కువగా ఉంటాయి. ఆ విషయాన్ని అర్థం చేసుకోవడం వల్ల నేను ఆటగాడిగా, వ్యక్తిగా ఎదగగలిగాను' అని మెస్సి పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో మెస్సి.. జకోవిచ్‌తో పాటు అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజం టామ్ బ్రాడీ, ఎన్బీఏ స్టార్ కెవిన్ డ్యురాంట్ వంటి ప్రముఖులతో కూడా ముచ్చటించాడు. ఇక మెస్సి ఇప్పుడు ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో బరిలోకి దిగనున్నాడు. జులై 19న న్యూయార్క్‌లో జరిగే టైటిల్ పోరులో అర్జెంటీనా.. స్పెయిన్‌ను ఎదుర్కోనుంది.

# ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో అరుదైన రికార్డు.. టికెట్ ధర రూ. 27 లక్షలు!

ఫిఫా ప్రపంచ కప్ 2026 టోర్నీ తుది దశకు చేరుకుంది. స్పెయిన్, అర్జెంటీనా మధ్య తుది పోరు జరగనుంది. న్యూయార్క్‌లోని ప్రముఖ 'మెట్‌లైఫ్ స్టేడియం' వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌ను చూసేందుకు ఫుట్ బాల్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరికొన్ని గంటల్లో విజేత ఎవరో తేలనుంది. ఇది ఇలా ఉంటే.. ఇప్పటికే పలు రికార్డులు సృష్టించిన ఫిఫా ప్రపంచ కప్ 2026 మరో రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ ధర ఏకంగా రూ.27 లక్షలు పలికింది. ఇది ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధిక ధర కావడం విశేషం.ఓ స్పోర్ట్స్ మీడియా నివేదిక ప్రకారం.. ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించిన అత్యున్నత శ్రేణి (హాస్పిటాలిటీ) టికెట్ ధర ఏకంగా రూ. 27 లక్షలు పలుకుతోంది. ఈ ప్రీమియం హాస్పిటాలిటీ ప్యాకేజీలు కేవలం మ్యాచ్ వీక్షణకే పరిమితం కావు. విదేశీ వీఐపీలు, కార్పొరేట్ దిగ్గజాలను ఆకర్షించేలా స్టేడియంలో ప్రత్యేక విలాసవంతమైన లాంజ్‌లు, ఫైన్ డైనింగ్, విభిన్న లగ్జరీ సేవలను ఫిఫా అందిస్తోంది. అయితే, ఇది కేవలం వీఐపీ ప్యాకేజీ ధర మాత్రమేనని, సామాన్య అభిమానుల కోసం అందుబాటులో ఉండే సాధారణ మ్యాచ్ టికెట్ల ధరలు దీనికంటే చాలా తక్కువగా ఉంటాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.అమెరికా క్రీడా చరిత్రలో ఇప్పటివరకు అత్యంత ఖరీదైన ఈవెంట్‌గా 2024 లో జరిగిన 'సూపర్ బౌల్' (శాన్ ఫ్రాన్సిస్కో 49వతీబ వర్సెస్ కాన్సాస్ సిటీ చీఫ్స్) నిలిచింది. అప్పట్లో దీని సగటు టికెట్ ధర రూ. 9.6 లక్షలుగా నమోదైంది. ఇప్పుడు ఫిఫా ఫైనల్ టికెట్ ధర ఆ రికార్డును దాదాపు మూడు రెట్లు అధిగమించి సరికొత్త సంచలనం సృష్టించింది. ఇదే సమయంలో ఈ ఫైనల్ మ్యాచ్ లీస్ట్ టికెట్ ధర 6,943 డాలర్లు(సుమారు రూ.6 లక్షలు)గా ఉంది. ఈ భారీ ధరలపై క్రీడా అభిమానుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అత్యంత చౌకైన సాధారణ టికెట్ల ధరలు కూడా సాధారణ ప్రజల బడ్జెట్‌కు మించిపోతున్నాయి. దీంతో అంతర్జాతీయంగా జరిగే క్రీడా ఈవెంట్లు సామాన్యుడికి అందని ద్రాక్షగా మారనున్నాయనే చర్చ మొదలైంది. కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగి, నిజమైన క్రీడాభిమానులు స్టేడియాలకు దూరం కావలసి వస్తోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# సింధుకు తొలి ఫైనల్.. రెండేళ్ల టైటిల్ కరువు తీరేనా..!




ఒలింపిక్ విజేత పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణ ఫలించింది. వరసగా నిరాశ పరుస్తున్న తెలుగుతేజం జపాన్ ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టింది. లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టిలు తేలిపోయిన చోట భారత పతకం ఆశలు మోస్తున్న సింధు సెమీఫైనల్లో అదిరే విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. సెమీస్‌లో చెన్ యూఫీ ని చిత్తు చేసి ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ఈ మధ్య కాలంలో పరాజయాలతో విసిగిపోయిన భారత షట్లర్ 2024 తర్వాత తొలి ఫైనల్ ఆడబోతోంది.మహిళల సింగిల్స్‌లో ఒకప్పటిలా టైటిళ్లు గెలవలేకపోతున్న పీవీ సింధు ఎట్టకేలకు ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ రెండేళ్ల కాలంలో అయితే.. క్వార్టర్స్ లేదంటే తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సింధు జపాన్ ఓపెన్‌లో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. శనివారం జరిగిన సెమీస్‌లో చెన్ ఫీ(చైనా)పై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించింది.మొదటి సెట్‌ను 21-19తో గెలుచుకున్న సింధు.. రెండో సెట్‌లోనూ జోరు చూపించింది. 15-10తో భారత షట్లర్ ఆధిక్యంలో ఉండగా చెన్ కండరాల గాయంతో ఇబ్బంది పడింది. తాను ఆట కొనసాగించలేకపోవడంతో తెలుగు తేజం ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాచ్ అనంతరం భావోద్వేగానికి లోనైంది సింధు.'ఫైనల్‌కు చేరడం చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో ప్రతి మ్యాచ్‌ను చాలా ముఖ్యమైనదిగా భావించాడు. ఈరోజు మ్యాచ్ మరింత కీలకం కాబట్టి.. మొదటి నుంచి ఫోకస్‌గా ఆడాను. ఎందుకంటే.. టాప్ ర్యాంకర్లను ఓడించాలంటే ప్రతి పాయింట్ చాలా ముఖ్యం' అని ఆమె పేర్కొంది. రెండో సెమీఫైనల్ ఆడనున్న అకనే యమగుచి(జపాన్), పుత్రి కుసుమ వర్దానీ(ఇండోనేషియా)లలో ఒకరిని ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో సింధు ఢీకొట్టనుంది.


# రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై ఊహాగానాలు.. చెక్ పెట్టిన బీసీసీఐ కార్యదర్శి




లండన్: క్రికెటర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్ అతని అంతర్జాతీయ కెరీర్‌లో చివరి వన్డే అవుతుందని రూమర్స్ వచ్చిన నేపథ్యంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. లార్డ్స్ వన్డే రోహిత్ కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ కాదు అని ఆయన అన్నారు. రోహిత్ భవిష్యత్తుపై మీడియాలో కథనాలు వ్యాపిస్తున్నాయని, అయితే లార్డ్స్‌లో రోహిత్ చివరి వన్డే ఆడుతాడాన్న చర్చలు జరగలేదని సైకియా తెలిపారు. భారత వన్డే జట్టులో రోహిత్ శర్మ రెగ్యులర్ సభ్యుడు అని, దేశానికి అతను వీలైనంత కాలం ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. లార్డ్స్‌లో జరిగే వన్డే అతని కెరీర్‌లో చివరిది కాబోదన్నారు.చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్ 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 45.3 సగటు, 92.03 స్ట్రైక్ రేట్‌తో ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీల సాయంతో 589 పరుగులు చేశాడు. ఈ గణాంకాలు అతడి కెరీర్ సగటు (48.58 సగటు, 92.76 స్ట్రైక్ రేట్)కు దగ్గరగానే ఉన్నప్పటికీ, పరుగులు సాధిస్తున్న తీరు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 54.27 సగటు, 125.94 భీకర స్ట్రైక్ రేట్‌తో ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన రోహిత్ మార్క్ దూకుడు ప్రస్తుత ఆటలో కనిపించడం లేదు.ప్రతి ఇన్నింగ్స్ అతడికి ఒక పరీక్షలా మారడంతో క్రీజులో స్వేచ్ఛగా ఆడలేకపోతున్నాడు. మరోవైపు, జట్టులో స్థానం కోసం యువ ఆటగాళ్ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఓపెనర్ స్థానం కోసం 24 ఏండ్ల ముంబై యువ సంచలనం యశస్వి జైస్వాల్ వన్డేల్లోనూ తన ముద్ర వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. చివరి మూడు వన్డేల్లోనే జైస్వాల్ రెండు శతకాలు బాదాడు. దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ కూడా రేసులోకి రావడంతో రోహిత్‌పై ఒత్తిడి పెరిగింది.

# ఫిఫా.. థర్డ్ ప్లేస్ మ్యాచ్ ఆడాలనే ఆసక్తి ఎవరికీ లేదు: ఫ్రాన్స్ కోచ్

ఫిఫా ప్రపంచ కప్ 2026లో మూడో స్థానం కోసం ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌కు ముందు ఫ్రాన్స్ ప్రధాన కోచ్ డిడియర్ డెశాంప్స్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ మ్యాచ్ ఆడాలన్న ఆసక్తి ఇరు జట్లకు లేదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగుతున్నందుకు కాంస్య పతకాన్ని సాధించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. స్పెయిన్ చేతిలో సెమీఫైనల్లో 2-0 తేడాతో ఓటమి పాలవడంతో వరుసగా మూడోసారి వరల్డ్ కప్ ఫైనల్ చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు నీరుగారిపోయాయి. దీంతో శనివారం మయామిలో ఇంగ్లండ్‌తో మూడో స్థానం కోసం ఫ్రాన్స్ తలపడనుంది.మ్యాచ్‌కు ముందు డెశాంప్స్ మీడియాతో మాట్లాడారు . 'ఇది స్నేహపూర్వక మ్యాచ్ కాదు. మూడో స్థానం కోసం జరిగే అధికారిక పోరు. ఈ మ్యాచ్ ఆడాలని ఇంగ్లండ్ కోరుకోవడం లేదు.. మేమూ కోరుకోవడం లేదు. కానీ ఇక్కడికి వచ్చిన తర్వాత మా బాధ్యతను నిర్వర్తించాల్సిందే. ఫైనల్‌తో పోలిస్తే దీని ప్రాధాన్యం తక్కువే. అయినప్పటికీ



కాంస్య పతకం సాధించడమే ఇప్పుడు మా లక్ష్యం' అని అన్నారు. ఫ్రాన్స్ జట్టుకు ఇదే తన చివరి మ్యాచ్ అని డెశాంప్స్ వెల్లడించారు. ఈ మ్యాచ్ తర్వాత కోచ్ బాధ్యతలకు వీడ్కోలు పలకనున్నట్లు తెలిపారు. 'ఫ్రాన్స్ జెర్సీ ధరించిన ప్రతిసారీ గెలవాలనే బాధ్యత ఉంటుంది. మూడో స్థానాన్ని దక్కించుకోవడమే ఇప్పుడు మా లక్ష్యం. ఇది నా చివరి మ్యాచ్ అని నాకు తెలుసు. కానీ ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదు. ఆటతో ఒక అధ్యాయం ముగుస్తుంది.. జీవితం మాత్రం కొనసాగుతుంది' అని డెశాంప్స్ వ్యాఖ్యానించారు.ఫ్రాన్స్ డిఫెండర్ ఇబ్రహిమా కొనాటే కూడా డెశాంప్స్ వ్యాఖ్యలతో ఏకీభవించాడు. సెమీఫైనల్ ఓటమి తర్వాత మూడో స్థానం మ్యాచ్ ఆడాలని ఎవరూ కోరుకోలేదని, అయినప్పటికీ తమ కోచ్‌కు విజయంతో వీడ్కోలు పలకాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నామని తెలిపాడు. 'మూడో స్థానం కోసం ఆడాలని మా జట్టులో ఎవరికీ లేదు. కానీ మాకు మరో మార్గం లేదు. మా కోచ్ ఫ్రాన్స్ జట్టుకు ఎంతో సేవ చేశాడు. ఆయనకు కృతజ్ఞతగా ఈ మ్యాచ్ గెలిచి కాంస్య పతకాన్ని అందించాలని కోరుకుంటున్నాం' అని కొనాటే పేర్కొన్నాడు.




# వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్




రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది





# 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

# మధ్య తరగతి జీవితాల కష్టాలు..మిస్టర్ మిడిల్ క్లాస్




ఎంత ధనవంతులైనా ఏదో ఒక సందర్భంలో మధ్య తరగతి జీవితాన్ని అనుభవించినవారే. ఆ జీవితాల వెనకుండే కష్టాల్ని వినోదాత్మకంగా తెరపైకి తీసుకు రావడం ఓ గొప్ప కళ అన్నారు నటుడు శ్రీకాంత్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిస్టర్ మిడిల్‌క్లాస్'. లయ కథానాయిక. జి.నాగేశ్వర్ రెడ్డి దర్శకుడు. జీకే, సీఎన్ నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వి.వి.వినాయక్, దశరథ్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి శ్రీకాంత్ మాట్లాడుతూ 'వేంకటేశ్వర స్వామి పాత్ర లేకపోతే ఈ సినిమానే లేదు. అలాంటి గొప్ప పాత్రని రాజేంద్రప్రసాద్ చేశారు. ఈ సినిమా ప్రయాణం నా పాత రోజుల్ని గుర్తు చేసింది' అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇలాంటి గొప్ప పాత్ర చేసే అవకాశం రావడం నా అదృష్టం. శ్రీకాంత్‌తో 'క్షేమంగా వెళ్లి లాభంగా రండి' మొదలుకొని పలు విజయవంతమైన సినిమాలు చేశా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'శ్రీకాంత్‌తో సినిమా చేయడం నాకు ఎప్పుడూ హాయిగా ఉంటుంది. రాజేంద్రప్రసాద్ ఈ సినిమాకి వెన్నెముకలా నిలిచారు' అన్నారు.

# వంటలతో కాలక్షేపం చేస్తున్న..మా ఇంటి బంగారం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఒకప్పుడు తనకు వంట చేయడం పెద్దగా రాదని, కిచెన్‌లో గడపడం కంటే షూటింగ్‌లు, కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు పూర్తిగా మారినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం ఆమె రాయలసీమ సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమంత సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం ఆమె ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమ ప్రత్యేక వంటకాలను నేర్చుకుంటున్నారట. ఘాటు రుచులు, ప్రత్యేకమైన మసాలాలు, సంప్రదాయ తయారీ విధానాలతో ప్రసిద్ధి చెందిన సీమ వంటలను ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటూ, స్వయంగా తయారు చేసి రుచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ, ఇంటి వాతావరణంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. దీంతో గతంలో చేయలేకపోయిన ఎన్నో విషయాలను ఇప్పుడు ఆసక్తిగా నేర్చుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న సమంత బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విరామ సమయంలో వంటపై దృష్టి పెట్టడం ప్రారంభించినట్లు




తెలుస్తోంది. ఆరోగ్యకరమైన, ఇంట్లో తయారైన ఆహారం ఈ సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తూ, పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటున్నారని సన్నిహితులు చెబుతున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా కొత్త ఆనందాన్ని పొందుతున్నారని తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం' చిత్రంలో ఓ ఇంటి కోడలిగా సమంత ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. సినిమాలో కుటుంబానికి అండగా నిలిచే పాత్రలో కనిపించిన ఆమె.. ఇప్పుడు నిజ జీవితంలో కూడా కుటుంబంతో కలిసి గడుపుతూ,

Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. “RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com